# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 7-11-2024 | NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 | సంపుటి :31 | సంచిక:76 | పేజీలు:6 | వెల: రూ.1/-


**నమ్మలేని నిజాలు**

కల్తీ మందులు
రొక్కం తినే పందులు
చట్టం చుట్టాలు

బండి చక్రాలు
ధూమ మద్య పానాలు
వాడితే వాతే

కృత్రిమ మేధ
చిప్పుల చిద్విలాసం
రోగ విచ్చేదం

కోతల కవి
రాతలు చాలగొప్ప
చేతలుశూన్యం

పసిడి వేగం
పేదకు అందనంత
పసుపు కొమ్ము



– రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

ఆటో కుటుంబాలన్ని
దిక్కులేక రోడ్డెక్కిరి
అద్దెలెన్నొ కట్టలేక
నిక్కుతూ బక్కచిక్కిరి
నడుపుతున్న ఆటో వాళ్ళ
జీవితాలు అటో ఇటో !
పస్తులతో పడుకుంటూ
బతుకంతా ఎటో ఎటో !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## ఉపముఖ్యమంత్రి భట్టికి థ్యాంక్స్ చెప్పిన తిస్మా ప్రతినిధులు

**-విద్యుత్ చార్జీలు యధాతథంగా ఉంచి ప్రాణం పోశారు**
**-చిన్న పరిశ్రమలకు ఈ నిర్ణయం గొప్ప ఊరట**
**-24 గంటల విద్యుత్ సరఫరాతో ఫ్యాక్టరీలకు బాసట**
**-భట్టితో ఐరన్, స్టీల్ అసోసియేషన్ ప్రతినిధుల థ్యాంక్స్ మీట్**



హైదరాబాద్, నవంబర్ 6:విద్యుత్ ఛార్జీలు పెంచకపోవడం సాహసోపేత నిర్ణయం అని ఐరన్, స్టీల్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచకుండా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైనదని పరిశ్రమల యజమానులు తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను నేడు ప్రజాభవన్ లో తిస్మా ప్రతినిధులు కలిసి ఈ మేరకు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చార్జీలు పెంచితే రాష్ట్రాల్లోని స్టీల్, ఐరన్ పరిశ్రమలు మూసి వేసుకునే పరిస్థితి ఏర్పడేదని వివరించారు. విద్యుత్ ఛార్జీలు పెంచకపోవడం, 24 గంటల పాటు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడం మూలంగా తమ పరిశ్రమలకు గొప్ప ఊరట లభించింది అని భట్టి విక్రమార్క కు తెలిపారు. కాగా, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకొని గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు విస్తరించాలని డిప్యూటీ సీఎం ప్రతినిధులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోకి పరిశ్రమలు విస్తరించడం మూలంగా స్థానిక యువతకు ఉపాధి, ఆలయ మార్గాలు లభిస్తాయని.. పరిశ్రమలకు తక్కువ ధరలో వనరులు లభిస్తాయని.. ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని వారికి వివరించారు. సీఎంను కలిసిన వారిలో జాయింట్ ప్రెసిడెంట్ ప్రమోద్ అగర్వాల్, వైస్ ప్రెసిడెంట్ నీరజ్ గొయెంక, జాయింట్ సెక్రెటరీ సుధాంశు శేఖర్, కోశాధికారి వినోద్ అగర్వాల్ తదితరులు ఉన్నారు.

## ఆంధ్ర అల్లుడే అమెరికా ఉపాధ్యక్షుడు..



న్యూఢిల్లీ, నవంబర్ 6:అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ ఘన విజయం సాధించడంతో ఆంధ్రప్రదేశ్ అల్లుడు ఉపాధ్యక్షుడు కానున్నారు. 538 ఎలక్టోరల్ ఓట్లు ఉన్న అమెరికాలో గెలుపు కోసం 270ఓట్లు అవసరం కాగా.. రిపబ్లికన్ పార్టీ మెజార్టీ మార్క్ లీడ్‌ను దాటడంతో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షులు కానున్నారు. ఇక ఉపాధ్యక్షుడిగా జెడీ వాన్స్ ఎన్నిక కానున్నారు. గత ఎన్నికల్లో భారత మూలాలున్న కమల హారీస్ అమెరికా వైస్ ప్రెసిడెంట్ కాగా, ఈసారి తెలుగు మూలాలున్న వ్యక్తి భర్త ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కానున్నారు. దీంతో ప్రస్తుతం అమెరికా ఉపాధ్యక్షుడి భార్య ఉషా చిలుకూరి పేరు ఇప్పుడు భారత్‌లో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో మార్మోగిపోతోంది.

విద్యావంతుల కుటుంబం నుంచి వచ్చి అమెరికాలో స్థిరపడి.. దేశం గర్వించే స్థాయికి ఎదిగిన ఉష పూర్వీకుల మూలాలు కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం సాయిపురం గ్రామంలో ఉండగా.. విశాఖపట్నంలోనూ ఆమెకు బంధువులున్నారు. వైజాగ్‌కు చెందిన ఫిజిక్స్ ప్రొఫెసర్ సి శాంతమ్మ (96)కు ఉష మనవరాలు వరుస అవుతారు. శాంతమ్మ కూడా ఆంధ్ర యూనివర్సిటీలో ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. 96 ఏళ్ల వయస్సులో ఇప్పటికీ పిల్లలకు పాఠాలు చెబుతున్నారు.

## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు.. సీఆర్డీఏ పరిధిని 8,352 చ.కి.మీ కు పెంపునకు ఆమోదం



అమరావతి, నవంబర్ 6:ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గ సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. సీఆర్డీఏ పరిధిని 8,352 చ.కి.మీకు పెంపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో బుధవారం కేబినెట్ సమావేశం జరిగింది. 2014-18 మధ్య నీరు, చెట్టు పెండింగ్ బిల్లుల చెల్లింపునకు , ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ (ప్రోహిబిషన్)కు, ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ 1982 రీఫెల్ బిల్లుకు కేబినెట్ పచ్చజెండా ఊపింది. ఏపీ జీఎస్టీ (ఉ రా )2024 చట్ట సవరణకు, ఎక్సైజ్ చట్ట సవరణ ముసాయిదాకు సమావేశం ఆమోదం తెలిపింది. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ లక్ష్యాల సాధనకు , పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు మంత్రివర్గ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులతో పాటు, రాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శి పాల్గొన్నారు.

## చరిత్రలో నిలిచిపోయేదే సమగ్ర కుటుంబ సర్వే.. దుద్దిళ్ల శ్రీధర్ బాబు




రంగారెడ్డి, నవంబర్ 6:చరిత్రలో నిలిచిపోయేదే సమగ్ర కుటుంబ సర్వే అని రంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ మంత్రి, రాష్ట్ర ఐటీ అండ్ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని భవానీ నగర్ కాలనీలో పోచమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమాలను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు? చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాట్లాడుతూ? తెలంగాణ రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, బలహీన వర్గాల ప్రజలకు సామాజిక ఆర్థిక విద్యా ఉపాధి రాజకీయ కుల సర్వే (సమగ్ర కుటుంబ సర్వే) కార్యక్రమం ద్వారా మరింత మెరుగైన ఫలితాలు అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వే చేపట్టడం జరుగుతుందని, రాబోయే రోజుల్లో ఈ సర్వే చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు.

బలహీన వర్గాలు, వెనుకబడిన తరగతులు, వెనుకబడిన తెగలు, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగుపరిచే ఉద్దేశంతో చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే విధంగా ఈ సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. రంగారెడ్డి జిల్లాలో 5384 ఎన్యూమరేషన్ బ్లాక్ లుగా విభజించడం జరిగిందని, ఒక బ్లాక్ లో 150 నుండి 175 గృహాలు ఉంటాయని ఎన్యూమరేటర్ గా వెళ్లే వారు ప్రతి కుటుంబం వద్ద 30 నుంచి 40 నిమిషాలు సమయం కేటాయించి పూర్తి వివరాలను సేకరించాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. భారతదేశంలో ఇప్పటివరకు ఎప్పుడూ జరగని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తమ నాయకుడు రాహుల్ గాంధీ సూచనల మేరకు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. పూర్తి సమాచారం కోసం ఏర్పాటు చేసిన ఈ సర్వే ను ప్రతి కుటుంబ యజమాని పూర్తిస్థాయిలో అర్థం చేసుకొని సహకరించాలని ఆయన కోరారు.

ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్లు ఈ సర్వే వల్ల ఎవరి రేషన్ కార్డు తొలగించబడదని, ప్రభుత్వ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది కలగదని ఆయన హామీ ఇచ్చారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ? సమగ్ర కుటుంబ సర్వే తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి ఒక రోల్ మోడల్ గా నిలబెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్, సీపీఓ సౌమ్య, డీపీఓ సురేష్ మోహన్, ఆర్డీవో చంద్రకల, డీపీఆర్ఓ వెంకటేశ్వరరావు, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ భీమ్ భరత్, మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్, కౌన్సిలర్లు చంద్రమౌళి, శ్రీనాథ్, వాణి, ప్రకాష్ గుప్తా, రాములు, ఎంపీడీవో వెంకయ్య గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ సురేందర్, డివిజన్ అండ్ జిల్లాస్థాయి అధికారులతో పూర్తి సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.

## సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభం..

**-వివిధ జిల్లాల్లో ఆమాత్యుల చేతుల మీదుగా శ్రీకారం**
**-ప్రతి ఇంటికి వెళుతున్న సర్వేయర్లు**
**-రంగంలో 50వేల మందికి పైగా ఉపాధ్యాయులు**
**-ప్రతి ఉపాధ్యాయుడికి 150ఇళ్లు అప్పగింత**
**-సర్వేకు అందరూ సహకరించాలని పొన్నం వినతి**

హైదరాబాద్, నవంబర్ 6: తెలంగాణ వ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైంది. వివిధ జిల్లాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు సర్వేను ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సామాజిక, ఆర్థిక వివరాలను సేకరిస్తున్నారు. ఉన్న ఆస్తులెన్ని.. అప్పులెన్ని.. ఆదాయమెంత.. ఇంట్లో ఎంతమంది ఉంటారు.. ఎవరైనా విదేశాలకు, ఇతర రాష్ట్రాలకు వెళ్లారా.. ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యారా.. ఇలా మొత్తం 75 రకాల ప్రశ్నలతో వివరాలు సేకరిస్తున్నారు. సర్వేలో కుటుంబ యజమాని, సభ్యుల వివరాలను నమోదు చేయడంతో పాటు కుటుంబంలోని ప్రతిఒక్కరి ఫోన్ నంబరు, వారుచేసే వృత్తి, ఉద్యోగ వివరాలను తీసుకుంటున్నారు.

కుటుంబంలో ఎవరైనా విదేశాలకు లేదా ఇతర రాష్ట్రాలకు వెళ్తే ఏ కారణంతో వెళ్లారనేది కూడా చెప్పాలి. ఉన్నత చదువు లేదా ఉద్యోగం, వ్యాపారం, పెళ్లి లేదా ఇతర అవసరాలకు వెళ్లారా.. అని కుటుంబ యజమానిని గణకులు అడుగుతున్నారు. విదేశాల్లో యూకే, అమెరికా, గల్ఫ్, ఆస్ట్రేలియా, కెనడాలతో పాటు ఐరోపా దేశాలకు వెళ్లినట్లు చెబితే ఒక్కో దేశానికి ఒక ప్రత్యేక కోడ్ నమోదు చేస్తున్నారు. మరే దేశానికి వెళ్లినా ఇతర దేశం అనే కోడ్ నమోదు చేస్తున్నారు. తెలంగాణ నుంచి ఎందరు వలస వెళ్లారు.. ఏ కారణంతో బయటకు వెళ్లారనే సమగ్ర సమాచారం సేకరించడానికి ఈ ప్రశ్నలు రూపొందించారు.

రంగారెడ్డి జిల్లా శంకరపల్లిలో సమగ్ర కుటుంబ సర్వేను మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. విద్య, ఉపాధి, సామాజిక, రాజకీయ ఆర్థిక ప్రణాళికల కోసం సర్వే చేపట్టినట్లు తెలిపారు. రేషన్‌కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులు పోతాయని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. దీని వల్ల ఎలాంటి కార్డులు పోవని స్పష్టం చేశారు. ఇంటింటి సర్వేకు ప్రజలందరూ సహకరించాలని శ్రీధర్‌బాబు కోరారు.



సాహిత్యం, సామాజిక
నిర్వహిస్తున్న
## 'బుధవారం బాద్షా'
పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ



**జన్మదిన శుభాకాంక్షలు**

మహా దేవాతి దేవుళ్లు దీవించిన రోజు
మణి మాన్విత రమాదేవి పుట్టినరోజు
మమతల మాధుర్యం వెల్లివిరిసిన రోజు
మకరంద కులకర్ణి సదనం
ఆనందించిన రోజు .
విద్యాపరిమళంతో వికసించిన దేవిలా
విదుర నీతితో విజయం పొందిన సబల
విదుషి మణిగా వెలుగొందిన మహిళ
విరామమెరుగని సాహితీ సేవలు నీ కళ.
సాహిత్య పూదోట సాగేటి కోయిలవై
సకలజన సాంగత్య సంకల్ప వెన్నెలవై
సంకీర్తనలో అనునిత్యం సవ్యసాచివై
సుఘంధపుష్పా సప్తతంతువైన దేవతవు.
హలము మనబలమన్న అధినేతవు
హృదయందేవాలయం అన్న మాతవు
హేమము లాంటి
మనసున్న సమతవు
వెయ్యేండ్ల కీర్తి పొందాలని
మా హితువు.
మీ జననం జగతికి ఆదర్శం
మీ సేవలే అనునిత్యం నిదర్శనం
మీ బాటలో పయనించుట ధర్మం
అభినవ సరస్వతీ నీకు వందనం.
రమణీయ రమాదేవి కులకర్ణి
మేడమ్ గారికి
హృదయపూర్వక పుట్టినరోజు
శుభాకాంక్షలు
ఆత్మీయ అభినందనలతో ..

–వాకిటి రామ్ రెడ్డి
ఆత్మీయ భారతి సాహిత్య
సేవ సంస్థ ( అధ్యక్షులు)

కణిక సాహితీ సమూహ రాధా సారధి
సతత కవన పోషక కళానిధి
విద్యార్థుల హృదులు కొల్లగొట్టిన పెన్నిధి
గుణంలో, వ్యక్తిత్వంలో తరగని నిధి
ప్రవర్తనలో తనకు, తెలుసు తన పరిధి.
పనులన్నీ ఒంటిచేత్తో చేయగల అష్టభుజి
సర్వ కార్యాలు సమకూర్చగల సవ్యసాచి
కవనం, కథనం, వ్యాసం, ఉపన్యాసం
అంశమేదైనా కానీ,
తనకది చిటికెలో వశ్యం.
అందరు అసహ్యించుకునే చెత్తబండి
తనకయ్యింది సుదీర్ఘ కవితా వస్తువండి
చెత్తబండి చేతే గ్రంధాన్ని
ఆవిష్కరించిందండి
ఆ చెత్తబండి హృదయాన్నే గెలిచిందండి
తన సంస్కారానికి అదో మచ్చు తునకండి
చెబుతారందరు శ్రీరంగ నీతులండి
ఆచరించి చూపేది మాత్రం కొందరండి
అందులో ప్రధములు
రమాదేవి గారండి.
గురువులుగా బోధిస్తే
చాలదని
చెప్పేవాటిలో కొన్నైనా
ఆచరించాలని
కవయిత్రిగా రాసేస్తే
సరిపోదని
రాస్తే చాలదు పాటించి
చూపాలని
అనుసరించి చూపే ధైర్యం,
శౌర్యం
కవిలోకం
మెచ్చు కోవలసిన విషయం
కావాలి ఉన్నత పురస్కారాలెన్నో
మీ సొంతం
మీ సాహిత్యాభిరుచి
చేరుకోవాలి ఉన్నత శిఖరం
అందుకోండి మా జన్మదిన
శుభాకాంక్షలు
వర్ధిల్లాలి మీరు నిండు
నూరు వత్సరాలు.
–జె వి కుమార్ చేపూరి

రమాదేవి కులకర్ణి గారు
కణిక సాహితీ సమూహానికి
రథసారథి.
వ్యాఖ్యాతగా
మోటివేషన్ వక్తగా
పాటల రచయిత్రిగా
కవయిత్రిగా
బహుభాషా కోవిదురాలిగా
బహుముఖ ప్రజ్ఞాశాలి.
అనేక సాహితీ ప్రక్రియలలో
సిద్ధహస్తురాలు
చెత్తబండిపై
దీర్ఘ కవిత రాసిన
నిత్య చైతన్యమూర్తి
ఎందరికో స్ఫూర్తి.
రమాదేవి గారు
సదా దరహాస వదనంతో
విద్యార్థుల మనసులో
విద్యా సుగంధాలు నింపే
సహృదయమూర్తి.
నిరాడంబరత
సహృదయత
ఆమెకు ఆభరణాలు
రమాదేవి గారికి
పుట్టినరోజు సందర్భంగా
శుభాకాంక్షలు.
–గజవెల్లి శ్రీనివాసాచారి

పలుకరింపుల వర్షమై, చిరునవ్వులకు చిరునామాయై,
ఆత్మీయతకు నిదర్శనమై, అనురాగానికి ప్రతిరూపమై,
ప్రతినిత్యం ప్రోత్సాహమనే మందు గులికను అందిస్తూ, నిరంతరం సరికొత్తగా కణికను వజ్రంగా సానబెడుతూ, క్రమశిక్షణకు మారుపేరుగా
ముందుకు తీసుకెళుతూ, సత్ప్రవర్తనతో మెలిగితే
చల్లని చూపుల దేవతగా కరుణిస్తూ,
సత్ప్రవర్తనను విడనాడితే కన్నెర్ర చేసే కాళికగా,
కణికను చెదలంటని నిప్పుల కణికగా
స్వచ్ఛమైన సాహితీ సుగందాలను పెద్దచెల్లుతూ,
ముందుకు నడిపించే రథసారధి
రమాదేవి కులకర్ణి గారికి జన్మదిన శుభాకాంక్షలు.
– కొంజేటి రాధిక , ఊరు రాయదుర్గం






**చురక**

కుల వివక్ష కారణాలు
కాదా రాజకీయాలు
స్వార్థానికి రెచ్చగొట్టే
సామాజిక గాయాలు
కుల గణన ఒకటే నేడు
కాగలదా సాఫల్యం
ఆర్థిక అభివృద్ధి ఫలం
అందకుంటే వైఫల్యం



-వేల్పుల నారాయణ
9440433475

**నేటి కందం- నేటికి అందం**

వందేమాతర గీతము
వందనముల నందెడిగతి బంకిం వ్రాయన్
స్పందించెడి హృదయములకు
చందనమై యది నిలచెను చక్కని గతిలోన్!!

(7-11-1875 బంకిం బాబు
వందేమాతరం గీతం వ్రాసిన రోజు)



-రాధశ్రీ
సెల్:9494481210

# ట్రంప్ ఘన విజయం

**-ఇప్పటికే 277 ఎలక్టోరల్ ఓట్లతో విజయ దుందుభి**
**-మరో 35 ఎలక్టోరల్ సాధించే దిశగా అడుగులు**
**-226 ఓట్లకే పరిమితమైన హ్యారీస్**
**-26 రాష్ట్రాలలో ట్రంప్ కే పట్టం**
**-రెండో సారి అధ్యక్ష పీఠంపై ట్రంప్**



న్యూఢిల్లీ, నవంబర్ 6:అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ మరోసారి అగ్రరాజ్య పీఠాన్ని అధిరోహించబోతున్నారు. ఇప్పటి వరకు విడుదలైన ఫలితాల్లో ట్రంప్ 277 ఎలక్టోరల్ ఓట్లతో విజయ దుందుభి మోగించారు. అధ్యక్ష పీఠం దక్కించుకోవాలంటే 270 ఎలక్టోరల్ ఓట్లు అవసరం.. ఆ మార్క్ ను దాటేసిన ట్రంప్ 300 మార్క్ దిశగా సాగుతున్నారు. కమలా హారిస్ కు 226 ఎలక్టోరల్ ఓట్లు పోల్ అయ్యాయి. ఎన్నికల ఫలితాలు మొదలైనప్పటి నుంచి కూడా ట్రంప్ ముందంజలోనే ఉన్నారు.

ఈ ఎన్నికల్లో ఎంతో ముఖ్యమైన స్వింగ్ స్టేట్స్ ఫలితాల్లో కాస్తా అటు ఇటు అయినప్పటికీ కూడా ట్రంప్ నే విజయం వరించింది. ముందు నుంచి కూడా ఎన్నికల్లో గెలుపు మీద ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. అనుకున్నట్లుగానే ఆయనే గెలిచారు. మొత్తం 50రాష్ట్రాల్లో ఎన్నికలు జరగగా ఆ వెంటనే కౌంటింగ్ ప్రారంభించారు.. ఇప్పటికే 44 రాష్ట్రాల ఫలితాలు విడుదలయ్యాయి.. మరో ఆరు రాష్ట్రాల ఫలితాలు వెల్లడి కావాల్సి ఉంది.. వాటిలో ఆయిదు రాష్ట్రాల్లో ట్రంప్ అధీక్యంలో ఉండగా, ఒక్క రాష్ట్రంలో మాత్రం కమలా హ్యారీస్ ముందజంలో ఉన్నారు. మొత్తంగా ట్రంప్ ఇప్పటి వరకు 26 రాష్ట్రాల్లో విజయం సాధించగా, కమలా హ్యారీస్ 18 రాష్ట్రాలకే పరిమితమయ్యారు.

రెండోసారి అధ్యక్ష పీఠం..

277 ఎలక్టోరల్ ఓట్లతో మేజిక్ ఫిగర్ క్రాస్ చేసిన ట్రంప్, 67,204,711 పాపులర్ ఓట్లు సాధించారు. అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. గతంలో అమెరికా అధ్యక్షుడిగా పనిచేసిన ట్రంప్ రెండోసారి అధ్యక్ష పీఠం ఎక్కబోతున్నారు. మేజిక్ ఫిగర్‌కు 44 ఎలక్టోరల్ ఓట్ల దూరంలో హ్యారిస్ ఆగిపోయారు. చివర్లో గట్టి పోటీ ఇచ్చినా స్వింగ్ స్టేట్స్ లో ట్రంప్ ఆధిపత్యం కొనసాగడంతో కమలా ఓటమి పాలవ్వక తప్పలేదు.

మొదటి నుంచి చివరి వరకూ ట్రంప్ దూకుడు కొనసాగింది. ఒక సమయంలో స్లో అయిన ట్రంప్ 230 ఓట్ల దగ్గర చాలా సేపు నిలిచిపోయారు. ఆ సమయంలో కమలా హ్యారిస్ వేగంగా అందుకుని గట్టి పోటీ ఇచ్చారు. 226 ఓట్ల దగ్గర కమలా ఆగిపోయారు. కమల హ్యారిస్‌కు 62,303,005 పాపులర్ ఓట్లు రాగా చివర్లో ట్రంప్ మెరుపు వేగంతో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

## ట్రంప్‌నకు మోదీ అభినందనలు



న్యూఢిల్లీ, నవంబర్ 6:అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించడంపై ప్రధాని మోదీ సోషల్ మీడియాలో స్పందించారు. హృదయపూర్వక అభినందనలు మిత్రమా అంటూ ట్విట్టర్ లో పోస్ట్ చేశారు. ప్రజల అభివృద్ధి కోసం, ప్రపంచ శాంతి కోసం, స్థిరత్వం, శ్రేయస్సు కోసం కలిసి పని చేద్దామని పేర్కొన్నారు. గతంలో డొనాల్డ్ ట్రంప్ తో ఉన్న ఫొటోలను షేర్ చేశారు.

నేటినిజం
# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 7-11-2024


## ఘంటారావం

యథాస్థితి కొనసాగటమంటే
ఎదుగుబొదుగు లేదన్నట్లే
పైకి ఎదుగుతన్నారంటే
ప్రకాశిస్తున్నట్లే..

గుణపాఠాల్ని
గుర్తుంచుకో
జ్ఞాన పీఠాలుగా
మలుచుకో.

నీకు తెలిసిందే
నిజమనుకోకు
నిర్ధారణ చేయడం
మరువకు.

అనవసర ఆలోచనలకు
ఆస్కారమివ్వకు
అంతరంగాన్ని
అతలాకుతలం చేయకు



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

## ఈర్ష్య

తనను చూసి,
అందరూ
ఈర్ష్య పడాలనుకొనీ..
ఒక పెద్దకారు,
చాయ్ హోటలు ముందు ఆగి ,
"ఒక చాయ్ .. బగర్ షకర్ "అని
దర్పంగా అరిచింది..

అంతలోనే,
అక్కడికి
చెమటలు కక్కుకుంటూ
వచ్చిన సైకిలు,
"నాకొక చాయ్ ..డబుల్ షకర్"
అని కోరింది..,
కారు ,
సైకిలును చూసి ఈర్ష్య పడింది!



-డా॥ కాసర్ల నరేశ్ రావు
9442406252

# డిసెంబర్ 19 నుండి బుక్ ఫెయిర్



లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కోదండరాం, రమా మేల్కొటే, కె. రామచంద్రమూర్తి, యాకూబ్, వాసు తదితరులు.

దేశంలోనే పేరెన్నికగన్న హైదరాబాద్ బుక్‌ఫెయిర్ సొసైటీకి శాశ్వత భవనం నిర్మాణానికి స్థలం కేటాయింపు విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం అన్నారు. ఏటా డిసెంబరులో నిర్దిష్ట తేదీల్లో పుస్తక ప్రదర్శనకు ఎన్టీఆర్ స్టేడియాన్ని ఉచితంగా కేటాయించేలా ప్రత్యేక జీవో తెచ్చేందుకు ప్రయత్నిస్తానని అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 37వ హైదరాబాద్ పుస్తక ప్రదర్శన లోగో ఆవిష్కరణ సోమవారం జరిగింది. తమ సొసైటీకి దిశానిర్దేశం చేసేందుకు సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, సామాజిక వేత్త ప్రొ. రమా మేల్కొటే, సీనియర్ జర్నలిస్టు కె.రామచంద్రమూర్తి గౌరవ సలహాదారులుగా వ్యవహరించనున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి ఆర్. వాసు తెలిపారు. అనంతరం కోదండరాం మాట్లాడుతూ ఈ ఏడాది పుస్తక ప్రదర్శన ప్రారంభోత్సవానికి ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కవులు, రచయితలు, పాఠకులు, ప్రచురణ కర్తలందరినీ ఒకచోట కలిపే ఈ పుస్తకాల పండుగను డిసెంబరు 19 నుండి 29 వరకు నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు యాకూబ్ తెలిపారు. ఈ ఏడాది 350కిపైగా స్టాళ్లు కొలువుదీరనున్నాయని, ప్రింట్ మీడియాతో పాటు ఎలక్ట్రానిక్ మీడియాకు ప్రత్యేక స్టాళ్లు కేటాయిస్తున్నట్లు వివరించారు. స్టాళ్ల కేటాయింపులో పారదర్శకత పాటిస్తూ డిసెంబరు 1న లాటరీ తీయనున్నట్లు చెప్పారు. రమా మెల్కొటే, సీనియర్ జర్నలిస్టు కె.రామచంద్రమూర్తి పాల్గొన్నారు.

## మృత్యువు

మా వీధిలో
ఓ వ్యక్తి హఠాత్తుగా చనిపోయాడు
అతని కొడుకు పదేళ్ల వాడు
గోధుమ పిండిలో
పాలు కలిపినట్టు ముద్దుగా వుంటాడు
వస్తూ పోతూ "హాయ్ అంకుల్" అని పలకరిస్తాడు.
ఇవాళ వాడు పెద్దవాడై
అంత్యక్రియల ఏర్పాట్లు చూస్తున్నాడు
పూర్ణచంద్రుని లాంటి మోము
సగం జాబిల్లిలా అణిగిపోయింది.
మరణానికి
కారణాలు తెలుసు కొని ఏం చేస్తాం!
నాకు ఆ కుర్రవాడి భవిష్యత్తు గురించే
ఆలోచనలు ముసురుకుంటున్నాయి.
బాల్కనీ లోకి వెళ్లాలంటేనే భయమేస్తుంది.
మృత్యువు ఎవరికీ కనపడదు
పర్యవసానంలో తెలిసి పోతుంది
ఇతరుల చావు వార్త మనల్ని
శీతగాలిలా సోకుతుంది.
కాస్సేపు కుంగ దీస్తుంది
అది మనలోని మృత్యుభీతి కావచ్చు
చనిపోయింది తెలిసిన వాడని కాదు మనిషి!
మనమూ మనుష్యులమే కదా!
వీధి యధావిధిగా నడుస్తూనే వుంది
గృహస్థులందరూ టీవిలో
హరియాణా ఎలక్షన్ల
హోరాహోరీలో నిమగ్నమై వున్నారు
మనస్సు ఇటు వైపు మళ్లింది
చనిపోయిన వ్యక్తి
స్మశానానికి చేరి వుంటాడు.



-డా॥ ఎన్. గోపి
సెల్:9391028496

# మధురోహలు లలిత గీత ఫలాల పంట- ఆచార్య ఎల్లూరి శివా రెడ్డి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆచార్య ఎల్లూరి శివారెడ్డి. వేదికపై డా॥ఎం.కె.రాము, నరసింహప్ప, ఆచార్య టీ. గౌరీశంకర్, డా॥నాళేశ్వరం శంకరం, బైస దేవదాసు.

రాము లలిత గీతాలలో లయ ప్రాస తో కూడి వుంటాయని తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివా రెడ్డి అన్నారు. రాము కవితా సంపుటి **మధురోహలు లలిత గీత ఫలాలు పంట** అని అభివర్ణించారు. శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి నిర్వహణలో ప్రఖ్యాత కవి డాక్టర్ ఎం. కె. రాము రచించిన **మధురోహలు** కవితా సంపుటిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆచార్య శివారెడ్డి మాట్లాడుతూ రాము కవిత్వంలో మృధుత్వం సరళత పాడుకొనే వెసులుబాటు వుంటాయని వివ రించారు. సంపుటి లలిత గీత పరిశోధకులకు కర దీపికగా ఉంటుంది అని పేర్కొన్నారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీ వేత్త ఆచార్య టీ. గౌరీ శంకర్ మాట్లాడుతూ రాము ఆధునిక లలితగీతకారుల్లో ప్రముఖులు అన్నారు. పాట లయ తెలిసిన వారికి పాట రాయటం సులువై పోతుంది అన్నారు. మధురమైన ఊహలతో విఖ్యాతులు అక్కినేని ఎన్. టి. ఆర్, సినారెలతో పాటు అమ్మ గురించి అద్భుతంగా **ఏ గుడిలోని అమ్మ ఐనా నా అమ్మకు సరి కాదు అని** చెప్పటం గొప్ప భావన అని విశ్లేషించారు. తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం సంపుటిలోని కవితల పై లోతైన ప్రతీకాత్మక కీలక ప్రసంగంలో మధురోహలులో రసన వుందని అంటే నవ రసాలు ప్రోది ఇది అన్నారు. సంపుటి లోని 92 గీతాలులో భావ లాలిత్యంలో దేవులపల్లి కృష్ణశాస్త్రి సినారె ప్రభావం ఉంది అన్నారు. నేటి సమాజ హృదయం బండరాయిగా మారిన సందర్భంలో మానవత వాది రాము కవిత్వం కొద్ది మందిలోనైన స్పందింపజేస్తుందనీ ఆకాంక్ష వ్యక్తం చేశారు. రైతు ఆవేదనను స్పష్టంగా తన కవితలో చెప్పిన రాము అక్కినేని ఎన్.టి .ఆర్, సినారె పై తన అభిమానంను భావ ఛందురంగా వ్యక్తీకరించారు అని వివరించారు ఆదాయ పన్నుల శాఖ విశ్రాంత కమిషనర్ నరసింహప్ప. సంపూర్ణ జ్ఞాన సంపుటి మధురోహలు తనకు అంకితం ఇవ్వటం ఆనందకరం అని ధన్యవాదాలు తెలిపారు. నేటి నిజం సంపాదకులు బైస దేవదాసు మాట్లాడుతూ అక్షర యజ్ఞం చేసే కవి రాము అని ప్రశంసించారు. నేడు వాట్స్‌ఆప్ గ్రూపులలో కవులు పరస్పరం లైక్ లు పంచుకుంటున్న సందర్భం లో రాము తమ సంపుటిపై సమీక్ష గోష్ఠి నిర్వహించటం అభినందనీయమ న్నారు. నినాదాలు ఆవేశం వస్తువులుగా వున్న కవిత్వం కన్నా ప్రేమ భావన, హృదయ స్పందన తో రాసిన సాహిత్యం శాశ్వతంగా ఉంటుంది అన్నారు. మధురోహలులో ఇట్టి వస్తువు వున్నందున శాశ్వతగా పాఠకుల మనస్సులో వుంటుందని పేర్కొన్నారు. స్పష్టత భావ వ్యక్తీకరణ మనస్సుకు హత్తు కుంటాయని వివరించారు. చివరగా డాక్టర్ రాము ధన్యవాదములు తెలుపుతూ తన సాహితీ ప్రస్థానం వివరించారు. క్రమశిక్షణ, సమవీక్షణ తన వ్యక్తిత్వం అని చెప్పారు. తొలుత సుమాంజలి నాట్య సంస్థ గురువు సుమలత శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

# దాశరథి పేరుతో స్మారక భవనాన్ని నిర్మించాలి

-డా॥నందిని సిధారెడ్డి



దాశరథి పేరుతో స్మారక భవనాన్ని నిర్మించాల్సిన అవసరం ఎంతగానో ఉందని ప్రముఖ రచయిత తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు డా॥ నందిని సిధారెడ్డి అన్నారు. మహాకవి దాశరథి కృష్ణమాచార్య 37వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో కార్యదర్శి నామోజు బాలాచారి అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాశరథి రాసిన కథలను ఏరి కూర్చి **'నిప్పుపూలు'** పేరుతో ఓ కథ సంపుటిని వెలువరించింది. ఈ కార్యక్రమానికి హాజరైన సిధారెడ్డి మాట్లాడుతూ.. దాశరథి రచనలు చదవకపోతే దాశరథికి నష్టం కాదు కానీ నేటి కవులకు, రచయితలకు యువతరానికి, సమాజానికి చాలా నష్టం అన్నారు. దాశరథి అల్లుడు గౌరీశంకర్ మాట్లాడుతూ.. తెంగాణ సెక్రటేరియట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం కింద **నా తెలంగాణ కోటి రతనాల వీణ** అనే దాశరథి మాటలను పొందుపరచాలని సూచించారు. సమావేశంలో టీ. ఉదయవర్లు, డా॥ నాళేశ్వరం శంకరం, శరత్‌చంద్ర, ఆచార్య పిల్లలమర్రి రాములు, గంటా మనోహర్ రెడ్డి, కే. ప్రభాకర్, ఆచార్య డాక్టర్ ఎస్.రఘు, బడేసాబ్, రాపోలు సుదర్శన్, కందుకూరి శ్రీరాములు ఆచార్య టీ. గౌరీశంకర్, ఆనందాచారి,,రాయారావు సూర్యప్రకాశ్‌రావు పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.



పుస్తక సమీక్ష

# విలక్షణమైన అభివ్యక్తితో.. "జీవించిన క్షణాలు"!









ప్రతులకు:నిఖిలేశ్వర్
2-2-647/185/
1ఎ, శారదనగర్
(బాగ్ అంబర్‌పేట్)
హైదరాబాద్-500 013
సెల్: 9177881201

కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత, ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు అనువాదకులు, బహుగ్రంథ కర్త నిఖిలేశ్వర్‌గారు గత ఆరు దశాబ్దాలుగా సాహితీ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. 2015-17 ప్రాంతంలో ఆయన వెలు వరించిన "అగ్నిశ్వాస"కు 2020లో కేంద్ర సాహిత్య అవార్డు వచ్చిన తర్వాత, అంటే దాదాపు ఆరు సంవత్సరాల కవితా యాన దృశ్యం గా.. **"జీవించిన క్షణాలు"** కవితా సంపుటిని 2024లో మనకు అందిస్తున్నారు. నడుస్తున్న చరిత్రకు అద్దం పడుతూ.. కవి నిఖిలేశ్వర్‌గారు తన వ్యక్తిగత అనుభూతులను, అనుభవాల ను రంగరించి.. దేశంలోని రాజకీయ సాంస్కృతిక పరిణామాలను మేళవిం చి.. విలక్షణమైన అభివ్యక్తితో "జీవిం చిన క్షణాలు" గ్రంథానికి జీవం పోశారు. పరిపక్వత, పరిణతి చెందిన కవి ఆయన కనుక.. తాను ఎంపిక చేసుకున్న కవితా వస్తువులను కవితామయం చేయడానికి తమదైన శైలిలో పదబంధ ప్రయోగం చేసి.. శిల్పం విషయంలో కాన్తంత చతురతను ప్రదర్శిస్తూ సంక్లిష్టతకు తావివ్వకుండా ఇందలి 80 కవితలను తీర్చిదిద్దారు. ఇటీవలి నిదర్శనం 20 24 ఏప్రిల్, మే నెలలో "ఆంధ్రజ్యోతి" ఎడిట్ పేజీలో వచ్చిన ఆయన ఐదు కవితలు సార్వత్రిక ఎన్నికల సమయాన్ని వ్యాఖ్యానించినవి కావడం విశేషం! ఈ ఐదు కవితలను మన దేశ ప్రజాస్వామిక వ్యవస్థపై ఐదు వ్యాసాలుగా విశ్లేషిస్తూ వివరిస్తూ రాయవచ్చనేది నిజం!

నిఖిలేశ్వర్‌గారు తమ ముందు మాటలో పేర్కొన్నట్లు.. ఒక్క క్షణంలో యుగాల అనుభవాన్ని పొందగలిగే శక్తి మనిషికే సొంతం. అలా జీవించిన క్షణాలను ఆయా సందర్భాలతో జోడించిన అక్షరీకరణే కవిత్వం అని బలంగా విశ్వశించే నిఖిలేశ్వర్‌గారు 2018-24 మధ్య కాలంలో తాను రాసిన కవితల్ని ఏర్చి. కూర్చి ఈ గ్రంథాన్ని మనకు అందిస్తున్నారు. లోక పరిశీలనం.. సునిశితమైన సామాజిక అధ్యయనం, నడుస్తున్న చరిత్ర పరిశోధన వంటి ఉత్తమ లక్షణాలను సొంతం చేసుకున్న నిఖిలేశ్వర్ గారు తమ కవితల్లో సందర్భోచితంగా వాటిని ప్రస్తావిస్తారు. ఆయన ఉత్తమ వ్యక్తిత్వాన్ని.. సామాజిక చైతన్యం కోసం ఆయన పడే ఆరాటాన్ని.. అవసరమగుచోట ఆయన సున్నితంగా ప్రకటించే ధిక్కార స్వరాన్ని ఇందలి కవితల్లో అడుగడుగునా చూస్తాం. ఆయా కవితలకు శీర్షికలు పెట్టడంలో.. కవితల్ని ఎత్తుకోవడంలో.. కవిత్వ నిర్వహణలో.. ఔచిత్యవంతమైన పదబంధ ప్రయోగంలో.. కవిత్వ నడకలో..ముగింపులో నిఖిలేశ్వర్‌గారు ప్రదర్శించిన ప్రతిభ ప్రశంసనీయం.. పైకి అలతి అలతి పదాలతో ఆయన కవితలో కనిపించినప్పటికీ.. ఆయా పదాల పరదా మాటున బలమైన, గాఢమైన భావాలు ఉండటం కవిగా ఆయనకున్న అనుభవానికి నిదర్శనం గా నిలుస్తాయి. అంతేగాక విస్తృతంగా వ్యాఖ్యానించుకోవడానికి విశ్లేషించు కోవడానికి ఆయన కవిత్వం ఉండటం విశేషం.

**"జీవించిన క్షణాలలో"** శీర్షికతో రాసిన కవితలో నిఖిలేశ్వర్‌గారు ప్రకటించిన భావాలు తాత్త్వికతతో రూపుదిద్దుకున్నాయి.. కాల యవనికపై ఒక నెపం.. ఇక కొన్ని క్షణాల్లోనే జ్ఞాపకంగా మిగిలిపోవడం.. నడిచే కాలమంతా.. చేతివేళ్ళ సందుల్లోంచి నీరై కాలిపోవడం.. పెనం మీద పడ గానే కరిగిపోతున్న వెన్నెలా ఆవిరై పోవడం అంటూ జీవన సత్యాలను అద్భుతంగా ఆవిష్కరించారు.

దశాబ్దాల జీవితమంతా.. నిమిషాలమీదుగా దృశ్యమానం కావడం.. శరదృతు గానాలలో.. పుప్పొడి సరా గాలతో సీతాకోక చిలుకల్లా పరవశిం చడం అని చెప్పడం నిఖిలేశ్వర్‌గారికే చెల్లింది. ఈ కవితలో ప్రతీ పంక్తీ నర్మగర్భంగా జీవిత సత్యాలను మోసుకొచ్చిందని చెప్పవచ్చు.

**దోబుచులాడే మబ్బులన్నీ**
**కురువకుండానే**
**కలల్లా తేలిపోవడం..**
**ఈ నేలకు సహజీవులకు**
**అసలు పనికొచ్చామా**
**లేదా అనే ప్రశ్ననెదుర్కోవడం!!** అంటూ ఈ కవితను ఆలోచనాత్మకంగా ముగించారు. జీవితానుభవాన్ని, అనుభూతులను ఆవిష్కరిస్తూ రాశారు కనుక బలమైన భావాలకు ఈ కవిత నెలవైంది. అందరి హృదయాల్లో కొలువయ్యేలా తీర్చిదిద్దబడింది.

ఈ కవితను చదివిన ప్రతిసారీ పాఠకుని మనసులో కొత్త కొత్త ఆలోచనలు రేకెత్తిస్తాయి. జీవితం గురించిన స్పష్టతకు ఇందలి పంక్తులు దోహదపడతాయి. మళ్లీ మళ్లీ చదివించే కవిత ఇది! శరదృతు రాగాలు.. పుపొడిరాగాలు.. సీతాకోక చిలుకల్లా పరవశించడం.. వంటి పద బంధాలు కవితకు శోభను కూర్చాయి. నడిచే కాలమంతా- చేతివేళ్ల సందు ల్లోంచి నీరై కారిపోడం వంటి పదాలు సహజాతి సహజంగా వస్తువుకు బలా న్నిచ్చాయి. తాత్త్వికతను జోడించాయి. కవితలో చక్కగా ఒదిగిపోయాయి!

నిఖిలేశ్వర్‌గారు ప్రయోగించే పదబంధాలు లోతైన భావాలను ప్రకటించేలా ఉంటాయి. "ఒక అజ్ఞాత తీరం"పై కవితను కవి **"అజ్ఞాత తీర ప్రాంతాల మీద అడుగు జాడలన్నీ నావే"** అంటూ ఎత్తుకోవడం బాగుంది. అంతులేని **అగాధాల లోపల నర్తిస్తున్న జలరాశి అశాం తినాదే!** అంటూ కొన సాగించారు. ఏదో కొస నుండి కొండ కోనలు దాటి.. ఈ అంచుదాకా శ్వాసి స్తున్న సమూహంలో.. నేనొక ఒంట రిగా.. అందరిలో అందరిగా అవ్యక్తం గా నిలిచిన అనుభూతిని అని చెప్పడం బాగుంది.

**అక్షరాల అల్చిప్పలను అన్వేషిస్తూ**
**నా పాదాల కింది కదలి తరగల్లో**
**ఇసుక లోతుల్లోకి సుతారంగా**
**జారు తున్న నీటి కదలికల గిలిగింతల్లో**
**తప్పిపోతూ**
**సప్త సముద్రాల జలానుభూతిలో**
**మునిగి**
**ఇక్కడే అజ్ఞాత తీర ప్రాంతాలపై**
**ఒక ఉప్పెనలా**
**ఒక నమీరగానంలా!!** అంటూ ముగించారు. నికిలేశ్వర్‌గారు ఈ కవిత ద్వారా పైకి అలతి అలతి పదాలు ప్రయోగించినప్పటికీ.. పైకి జలం-తీర ప్రాంతం అంటూ చెప్పిన ప్పటికీ.. జీవన ప్రస్థానాన్ని చెప్పకనే చెప్పారు. సప్త సముద్రాల జలాను భూతిలో మునిగి.. ఇక్కడే అజ్ఞాత తీర ప్రాంతాలపై అనడంలో కవి యొక్క ప్రతిభా పాటవాలను ప్రస్తుతిం చకుండా ఉండలేము!

**ఎన్నికల జూదంలో**
**ప్రలోభాల వలయంలో**
**పావులుగా మారిన జనమంతా..**
**కులాలవారీగా మతాల వారీగా**
**ముద్రలు పడిన మనమంతా**
**బహురూపుల మూకస్వామ్యంలో**
**గొణుగుతూనే వున్నాం రోజంతా..**
అంటూ నడుస్తున్న చరిత్రకు అద్దం పడుతూ **"అధికారం వేటలో"** కవితను తీర్చిదిద్దారు. "మూక స్వా మ్యం" పదాన్ని ఔచిత్యవంతంగా ప్రయోగించారు. కవి నిఖిలేశ్వర్‌గారు పేర్కొన్నట్లు..

**ఆధిపత్య పోరులో..**
**అధికారం వేటలో నీతి, న్యాయం**
**జన స్వామ్యం విధ్వంసమవుతున్న మాట వాస్తవం!**
**ఎవరికి దక్కిన ఆధిపత్యం!**
**ఎవరనుభవిస్తున్న అధికారం?** అని ప్రశ్నించారు.

కవి "కరోనా" నేపథ్యంలో **"ఈ అకాల శిశిరాన"** కవితను రూపు దిద్దారు.

**ఈ "కోవిడ్" చావు దప్పుల మోతలో**
**శవాలపై లక్షలు ఏరుతున్న**
**వైద్య వ్యాపారులపై అంకుశమేది?** అని నిలదీశారు.. ఈ అతిపెద్ద ప్రజాస్వామ్యాన **ప్రశ్నించే గొంతుకలన్నీ**
**జైలు గోడల మూగ రోదనలేనా?** అని వాపోయారు.

**ఈ విపత్కర జీవన సంధ్యలో**
**రోదించే కలాల**
**శోక గీతాల కాలమిది..**
**ఈ అకాల శిశిరాన**
"శీత వేళ రానీకు" హెచ్చరిక **అనుభవిస్తే కాని అర్థం కాదు** అంటూ వ్యాఖ్యానించారు.

**"శేష ప్రశ్నల అధ్యాయం"** కవితలోనూ కవి ప్రకటించిన భావాలు ఆర్ధ్రంగా ఉన్నాయి.

విలక్షణమైన అభివ్యక్తితో ఈ కవితను ఎత్తుకున్నారు.

**ఇపుడు అన్ని రుతువుల మీదుగా**
**ఆక్రమించిన శిశిర రుతువే**
**జనన మరణాల రిజిస్ట్రార్‌కు**
**పని కల్పించింది చేతినిండా** అంటూ ప్రారంభించారు. "జనన మర ణాల రిజిస్ట్రార్" పదాన్ని ప్రయో గించి.. కవిత యొక్క ఎత్తుగడకు పుష్టిని కల్పించారు.

కరోనా కాలం నాటి పరిస్థితులను నర్మగర్భంగా ప్రస్తావిస్తూ.. **ఇపుడు ఈ సర్వసత్తాక**
**సార్వభౌమిక దేశంలో**
**ఆసుపత్రుల కాటికాపరుల బేరసారాల్లో**
**తల్లడిల్లుతున్న జాతి జనులంతా..**
**అంటూ కొనసాగించారు.**
**ఇపుడు మోగుతున్న మృత్యు ఘంటికల నేపథ్యగానంలో**
**నువ్వు, నేను మనమంత పాత్ర లమే** అని చెప్పడం కవి యొక్క నేర్పరి తనాన్ని సూచిస్తోంది. 'మృత్యు ఘం టికల నేపథ్యగానం' వంటి పద బం ధాలు కవితలో చక్కగా ఒదిగి పో యాయి!

**"ఈ యుద్ధ సమయాన"..!'** కవిత లోనూ కరోనా పరిస్థితులను ఏకరువు పెట్టారు.

**రెడ్ జోన్లలో**
**కదులుతున్న వర్తమానం**
**సెల్ పరామర్శలతో**
**ఊపిరి పోసుకుంటున్న**
**మానవ సంబంధాలు..** అంటూ ప్రకటించడంలో వాస్తవముంది!
**మనిషికి మనిషి దూర మంటున్నా..**
**కరోనా హెచ్చరికలు**
**నాగరికత వికృత వికటాట్ట హాసంతో**
**వార్‌జోన్‌లో కూరుకపోయిన ప్రపంచంలోని ఘటనలను** ఈ కవితలో కవి దృశ్యమానం చేశారు.

**"కరోనా వార్"** కవితలోనూ.. కరోనా నాటి పరిస్థితులను ప్రతిభావం తంగా ప్రస్తావించారు.

వలస బాట పట్టిన
**పునాది రాళ్లు**
**దిక్కు మొక్కు లేని జనం**
**పాదాల కింది మట్టి**
**కన్నీట తడిసింది పరాధీనంగా!**
**అటు వైభోగాలతో శ్వాసించిన**
**సుఖ జీవుల దేశాలన్నీ**
**నిస్సహాయంగా శవాల గుట్టలుగా!**
**ఇప్పుడిక ఏ దేవుళ్లు**
**ఏ మతాచార్యులు ఆదుకోలేరు**
**భక్తి వ్యాపారాలన్నీ**
**మూసేసుకున్నాయి తలుపులు** అని వ్యాఖ్యానించారు.

**అజేయుడైన మనిషికి**
**ధైర్యమే ఆయుధమనీ**
**నిరంతర విజ్ఞాన పరిశోధనే**
**మానవ విజయమని మంచి**
ముగింపునిచ్చారు ఈ కవితకు!

'కొనసాగుతున్న చరిత్ర' కవితలో విలువలకు వలువలు వెతుకుతున్న వర్తమానాన్ని ఆవిష్కరిస్తూ.. ఈ ఉపఖండంలో మరో మార్గం లేదా? అంతటా వికల్పహీనమా? అనే విచికిత్సతో రోదిస్తున్న సభ్య సమాజం! అంతిమంగా అవినీతినే జీవిత విధాన మని భావించే ఈ దేశంలోనే.. ప్రశ్నిం చి ప్రతిఘటించే ప్రజల సమీకరణే తప్ప.. మరో దారి లేదని కొనసాగు తున్న చరిత్ర అని వివరించారు.

**లోలోన పడగ విప్పే**
**భయం.. అభద్రత సర్పాలను**
**నిద్రపుచ్చే ప్రయత్నమే**
**మన జీవితమంతా!** అంటూ **"వ్యవస్థ వంచితులు"** కవితను రాశారు.

కాలానికి సాక్షిగా నిలిచే అక్షరాల వారసుడా!

ఇంకెంత కాలం నీ కన్నీటి భాష్యం? అంటూ "అక్షరాల వెంట" కవితను తీర్చిదిద్దారు.

కవి నిఖిలేశ్వర్‌గారు తాత్త్వికతను చాటుకుంటూ రాసిన కవితలూ ఈ సంపుటిలో మనకు దర్శనమిస్తాయి. "రాగ విరాగాల మధ్య", "మరుక్షణం కొత్తదే" "వంచతప్త మహా సాగరంలోకి" "ఏమైనా కావొచ్చు", "కొన్ని **సమయాలు", "మృత్యుక్రీడ"** శీర్షికలతో రాసిన కవితల్లో కవి యొక్క కవితా పటిమను చాటేలా ఉన్నాయి. ఎంపిక చేసుకున్న వస్తువులను ప్రతిభావంతంగా అభివ్యక్తీకరించారు.

"కులా లకుంపటి" కవితలో నడుస్తున్న చరిత్రను ప్రతిఫలింప జేశారు. ఉర్దూ, మలయాళం, జర్మన్, బోడో, తదితర భాషల నుండి అనువదించిన కవితల్నీ ఇందులో పొందుపరిచారు.

ఇలా ఎన్నో కవితలో ఈ కవితా సంపుటిలో ఉదహరించడానికి యోగ్యంగా ఉన్నాయి. ప్రతీ కవితలో కవి యొక్క జీవితానుభవాన్ని, లోక పరిశీలనను చూడగలం. కవి నిఖిలేశ్వర్ గారికి సమాజం పట్ల ఉన్న శ్రద్ధాభక్తులను, మసకబారుతున్న మానవ సంబంధాలకు మెరుగులు అద్దాలన్న ఆకాంక్షను ఇందలి కవితల్లో అక్కడక్కడ వీక్షించగలం- 2018-2024 మధ్య నిఖిలేశ్వర్‌గారు రాసిన కవితల్ని ఏర్చి కూర్చి వెలువరించిన ఈ సంపుటి అందరు చదువదగింది.



- దాస్యం సేనాధిపతి
సెల్9440525544

## ఆలయ గోపురం

వానచినుకు రాలినప్పుడల్లా
నాలోని దుఃఖం,
మేఘాలతో పోటీపడుతోంది
స్వర్గంలాంటి అమ్మ ఒడిలో
శిశువుగా మారే క్షణాల కోసం
కాలాన్ని రంధ్రాలు చేసి
నిత్యం అన్వేషిస్తున్నాను
కడుపులో ఆకలి శతృవులా
దండయాత్ర చేసిన ప్రతిసారి
పేగుల అరుపుల కవాతుల్లో
అమ్మకోసం నా చూపుల వేట
కదంత్రొక్కుతూనే వుంది.
నా కోసం అమ్మ కమ్మగా పాడే
జోలపాటల చిరునామాల కోసం
నిశిరాత్రి రహదారులన్నీ
ఏకాకినై వెతుకుతున్నాను
తలనుదువ్వే చేతిలోని దువ్వెనసైతం
రోజూ అమ్మ చేతివ్రేళ్ళ స్పర్శ కోసం
అరచేతిని నిరాహారదీక్ష శిబిరాలుగా
మార్చుకుని సమ్మె సైరన్ మ్రోగిస్తోంది
అమ్మ తొడగని చొక్కాగుండీలు సైతం
బంధాన్ని నిలువునా తెంపుకుని
చీకట్లో జారిపోతున్నాయి.
అమ్మ ముద్దుల కోసం
బెంగ పెట్టుకున్న నా బుగ్గలన్నీ
నిలువునా వాలిపోయి
నేలమీద గడ్డిలా ఎండిపోతున్నాయి
ఈ ప్రపంచంలో ప్రతి అంశానికి
నన్ను పరిచయం చేసింది అమ్మే
నడక నేర్చుకున్న క్రొత్తలో
ఎక్కడ పడిపోతానేమోనని
తన చూపుల పొత్తిళ్లను
నేలనిండా పువ్వుల్లా పరిచేది
ఒక్కొక్క మాటను నేర్పిస్తూ
భాషా నిఘంటువుకు ఏకంగా
నన్ను సొంతదారుడ్ని చేసింది.
అమ్మ నడిచివచ్చే దారులకోసం
నా ఆశలు తివాసీలవుతున్నాయి
అమ్మ రాకకోసం ఆలయ గోపురాలన్నీ
మా ఇంటి గుమ్మాలై నిలబడతున్నాయి
నా వయసు ఏడుపదులు దాటిందని
ఎదురుపడ్డ అందరితో
నా ముఖం ముడతలు చెప్తున్నా
ఆశగా రోజూ ఆకాశం వైపు
నిలబడి చూస్తూనే వున్నాను
అప్పటి నా ఆరేళ్ల పసితనం సాక్షిగా
శాశ్వతంగా లోకాన్ని విడిచిన అమ్మ కోసం
అమ్మ తినిపించే పాలబువ్వకోసం



-డా. కె.జి. వేణు,
98480 70084

## సాధ్యమేనా...

ఈ గది ఖాళీ చెయ్యడం
అంత మామూలు విషయం కాదు
మూలమూలలా ఒదిగిపోయి
మమేకమైన జ్ఞాపకాలు
తుడిచి పెట్టడం ఎవరికి సాధ్యం.
అరలు అరలుగా అమర్చుకున్న
గదినిండా ఆగని నిధినిక్షేపాల ప్రవాహాలే.
అమాయకత్వం తొంగి చూసే
ఆ యౌవనారంభ తొలి సంబరాలు
ఇంకా సాయంత్రమవుతూనే విచ్చుకునే
అజరామరంగా పలకరించేపరిమళాలు.
ఈ మూలన ఇంకా రాత్రీ పగలూ
చదువుకున్న మనుషుల పునశ్చరణ
అరిపోయిన మనసులూ
చేదెక్కిన వంకర మాటలూ
ఉండుండి కాటేసి పారిపోయే
విషజీవాలు.
ఎప్పటికప్పుడు చెత్త ఊడ్చిపారేసి
తుడిచి ముగ్గులేసుకున్న మనః ప్రాంగణంలో
జడలు విరబోసున్న తుఫానులూ
ఎడారి నడి వేసవి భుగభుగలూ
తల్చుకూంటేనే
ఫర్నేస్ లా మారి మాడ్చి మసిచేసే
మనో దౌర్బల్యాలు.ఏ అర్ధరాత్రో
దానికదే ఊరడిల్లిన మనుగడ
ఊపిరి పీల్చుకుని చెక్కుకున్న నాలుగక్షరాలు
పెదవుల చివర నాటుకునే చిరునవ్వులు
గదినిండా నింపే సోలార్ వెలుగులే.
ఈ నేల మీద మీద వాలి
గుండెచెవిని అమ్మ గుండెకు ఆనించినప్పుడు
ఎక్కడో అమృత జల సడి
దోసిళ్లతో ఎంత త్రాగినా
తీరని దాహం
తలుపుల్లేని గోడల మధ్య
తమకంలా పెరిగిపోయే
తపనను
ఖాళీ చెయ్యడం సాధ్యమేనా?



-స్వాతీ శ్రీపాద
8297248988



ఈనెల 3న వేములవాడ జె.ఎన్.బి.ఇడి కళాశాలలో ఈశ్వరిగారి ముక్తేశ్వరి ఫౌండేషన్ నిర్వహించిన సాహితీపురస్కారాలు -2023 కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావుని సత్కరిస్తున్న వేములవాడ శాసనసభ సభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. చిత్రంలో అష్టకాల రామ్మోహన్‌రావు,గిరిజా మనోహర్‌బాబు, బి.ఎస్.రాములు, యు.మోహన్‌రెడ్డి, ఫౌండేషన్ అధ్యక్షులు ఈశ్వరిగారి నరహరి శర్మ తదితరులు




ధనయోగం
ప్రయోగం
కష్టాన్ని నమ్మక -అడ్డదారి ఫలితం
నిరుపయోగం.
**-క్రొవ్విడి వెంకట బలరామమూర్తి**
హైదరాబాద్.

వేదం
నాదం
ఎదలో -విన్న వారికి కలుగుతుంది మోదం
**-కానుకొలను లక్ష్మీ సీత**
హైదరాబాద్

ఏకైనా
మేకైనా
విఫలమైనది పట్టుదలతో సఫలమవుతుంది
-నీకైనా నాకైనా
**-సదా స్వామి**
విశాఖపట్నం

తప్పు
ఒప్పు
వివరించినా నేడు -ఎవరు వింటారు చెప్పు
**-లలితాచండి**
హైదరాబాదు

ఇష్టపడి,
కష్టపడి
బాధ్యతాయుతంగా ఆసక్తితో చేయకపోతే-
పోతారు నష్టపడి.
**-డాక్టర్. షహనాజ్ బతుల్**
హైదరాబాద్

భృతి
స్మృతి
సంయమనంతో సాగే జీవితాలకి ఋజువు -
ధృతి
**-డాక్టర్ వరలక్ష్మి హరవే,**
బెంగుళూరు

విరచితము
విదితము
విజ్ఞులు ఉపదేశించే నీతి వాక్కులు
-సుభాషితము.
**-బలివాడ వేణు గోపాల రావు,**
హైదరాబాద్.

పసిప్రాయం
ముసలిప్రాయం
అపురూపంగా వారిని చూసుకోవాలని -
విజ్ఞుల అభిప్రాయం
**-డా. రమాదేవి ముత్యపు**
హైదరాబాద్

నిన్న
మొన్న
ఎన్నడైనా అన్నదానం మిన్న -ధర్మగ్లానికి సున్న
**-రాజేశ్వరి కుప్పిలి**
విజయనగరం

త్యజించకు
తలవంచకు
సంపదకు అధికారానికి -సద్గుణాలను, స్వేచ్ఛను
విక్రయించకు.
**-అంజనీదేవి శనగల**
విశాఖపట్నం

కోపాలు
తాపాలు
బుద్ధిహీనమైన ఆలోచనలు -చేయించును మనతో
పాపాలు.
**-జి. విజయ మేరి**
అనంతపురం జిల్లా

అవధానం
సమాధానం
దేనికయినా భాష మీద పట్టు- ప్రధానం.
**-పూడిపెద్ది వెంకట సుధారమణ**
విశాఖపట్నం

చిగురు..!
ఒగరు...!!
కొంతమందికి ఎంత చెప్పినా వినరు-
పొగరు....!!!
**-మహమ్మద్ అంకూస్**
బెల్లంపల్లి

ఉత్తరం
తత్తరం
చరవాణీలు చేతులకు వచ్చాక-తపాలాశాఖ
బిత్తరం!
**-డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచార్య**
మహబూబ్ నగర్.

జయప్రదం
మంగళప్రదం
కార్తీక మాసం నోములకూ వ్రతాలకూ
-శుభప్రదం
**-రాయవరపు సరస్వతి**
చోడవరం,అనకాపల్లిజిల్లా

సంకాశము
ప్రకాశము
ధృడసంకల్పంతో కృషిచేస్తే హద్దు మాత్రమే
-ఆకాశము.
**-డబ్బీరు ప్రభాకర్,**
రాయపూర్.

ఆనందము
పరమానందము
దైవచింతనలో పరాకాష్ట తురీయావస్థ
-చేరగలిగితే బ్రహ్మానందము.
**-విజయకుమారి ముదిగొండ**
విజయవాడ.

ఖగోళం
భూగోళం
మనిషి మూర్ఖత్వం -అవనిని చేస్తున్నది
గందరగోళం..
**-సంధ్య జంగాల (భాస)**
కంకిపాడు

వరించి
చరించి
జీవిత మాధుర్యాన్ని గ్రోలాలి జీవిస్తూ -తరించి.
**-టి.డి.కస్తూరి**

రువ్వండి
నవ్వండి
ఛలోక్తులు విసురుతూ,ఆనందంతో
ఆరోగ్యవంతులు అవ్వండి.
**-టి.రామాంజనేయులు**

ఉచ్ఛము
నీచము
తెలిసి మెదలొచ్చు -స్నేహాన్ని వదలడం తుచ్ఛము
**-అభిషేక్**

వందనీ
చందనం
పరిమళం కలిగి తెస్తుంది -స్నేహమనే బంధనం.
**-ఉప్పల పాటి వెంకటరత్నం.**

ఎండ
మండ
పథికునికి ఉండాలి తరువుల -చల్లని అండ
**-రాజేశ్వరి**
విజయనగరం

వరుగు
పెరుగు
అప్పుడే అది రుచికరమైన భోజనం - అనబరుగు
**-డా.రమ్య స్వరూప్**
హైదరాబాద్

జీవుడు
దేవుడు
మనిషిని ప్రశ్నలతో బ్రతకమని వదిలాడు
మహానుభావుడు
**-డా.పి.వి.రామకుమార్**

మృదుభాషి
మితభాషి
ఏమి లాభం మనిషి - కానిదే హితభాషి!
**-శ్రీ పెరంబుదూరు నారాయణరావు**
హైదరాబాద్.

నిత్యము
సత్యము
ఒడిదుడుకుల్లో నిబ్బరంగా నిలిచేవారే -
జాతి ముత్యము !!
**-యన్.కే. నాగేశ్వరరావు,**
పెనుగొండ.

కృషిఫలం
శ్రమఫలం
రాళ్ళు మోయలేని ఉడుతకు -
రామస్పర్శ ప్రతిఫలం
**-ఫణీంద్ర విన్నకోట**
హైదరాబాదు

నేర్పరి
కూర్పరి
క్లిష్టమైన పరిస్థితులలో విజయం సాధించేవాడు
-ఓర్పరి
**-సింగీతం విజయలక్ష్మి, చెన్నై**

నయాన
మయాన
తప్పక ఉండాల్సిందే మనవారిపై అభిమానం-
స్వయాన
**-పరుచూరి. నాగేంద్రమ్మ, ఒంగోలు**

ఆచారం
దురాచారం
మాయల ప్రపంచాన్ని సృష్టిస్తూ -నాయకుల
ప్రచారం
**-కృష్ణ తేజ**

భయం
నయం
దిగులుగా ఉన్న రోగికి -వైద్యుడే అభయం.
**-బెహరా నాగభూషణరావు**
గజపతినగరం

అలుపు!
మలుపు!!
బాధల్ని భరించే ఓర్పు ఉంటేనే -గెలుపు!!!
**-లయన్:కంబాల తిమ్మారెడ్డి**
కళ్యాణదుర్గం,అనంతపురం జిల్లా

భోధకులు
శోధకులు
ప్రలోభాలకు లొంగని సుగుణవంతులు- గొప్ప
సాధకులు.
**-శ్రీ విశ్వేశ్వరమ్.**
భువనేశ్వరము.ఒడిశా.

అధికారం
అహంకారం
మమకారం పెంచకపోతే -చివరకు కోరుకొనును
ప్రతీకారం.
**-పొన్నాడ వరాహ నరసింహులు,**
ఆమదాలవలస.

వైద్యం
సేద్యం
వ్యవసాయం ఆగితే-దైవానికీ అందదు నైవేద్యం
**-శైలజ సామినేని**
విజయవాడ

తప్పు
ఒప్పు
ఆత్మ విమర్శ చేసుకొంటే - తప్పును ముప్పు
**-వి. శ్రీనివాస మూర్తి**
హైదరాబాదు

అంతో
ఇంతో
తెలిసిందంతా కొంతే! -తెలుసుకోవాలి విద్యలో
-ఎంతెంతో!
**-పద్మావతి .పి**

అరువు
పరువు
వ్యాపార వలయంలో రైతును వెంటాడుతున్న
- కరువు
**-కట్టెకోల చిన నరసయ్య,**

మేలుకో
కోలుకో
కాలాన్ని సద్వినియోగనీ పరుచుకో- మంచిగా
ఏలుకో !
**-కె.కె.తాయారు** మదనపల్లి (చిత్తూరు జిల్లా).



## అమ్మ

నీడనిచ్చేవృక్షం
నిప్పులుగ్రక్కదు
గంగనిచ్చే గగనం
గరళాన్నికురవదు
ఆత్మవిశ్వాసాన్నిచ్చే కొండ
తలదించదు
కోటానుకోట్ల మొక్కల్ని ప్రసవించే
భూమి కల్మషమెరుగదు
ఆప్యాయతనందించే అమ్మ
ఆజన్మాంతం అలసటనెరుగదు
మనిషన్నవాడు అమ్మను మరువడు!

**-డి.కె.చదువులబాబు,**
9440703716



# అనుభవాల కథా కెరటాల కడలి

తెలుగు సాహితీ వనం వారి 7వ వార్షికోత్సవం సందర్భంగా రవీంద్రభారతిలో ఆవిష్కరించిన కథా సంకలనం “కడలి”.

శ్రీమతి శాంతి కృష్ణ సంపాదకత్వం లో వెలువడిన ఈ “కడలి “ తెలుగు సాహితీ వనం వారు ప్రచురించిన రెండవ కథా సంకలనము.

25 మంది కథకుల రచనలు ఈ 25కథల “కడలి”.

ఈ కడలికి అద్భుతమైన అర్థవంతమైన ముఖచిత్రం అందించిన వారు “శ్రీ కూరెళ్ల శ్రీనివాస్ “గారు. చక్కటి ముందు మాటలు రాసిన వారు “శ్రీ ఆడెపు లక్ష్మీపతి”గారు

ఇంక సుప్రసిద్ధ రచయితలు మరియు కొత్త రచయితలు జీవితమనే కడలిని చిలకగా పుట్టిన అనుభవాల సారమే ఈ కథా సంకలనము అంటే అతిశయోక్తి కాదు.

మొదటి కథగా, జీవించటం కన్నా అద్భుతమైన వ్యాపకం లేదంటూ సత్యాజీ రచించిన “ఆనందమే జీవితం”లో ఎటువంటి సౌకర్యాలు లేకున్నా ఉల్లాసంగా బ్రతికే నిరుపేద మనుషుల జీవితాన్ని ఆవిష్కరించిన తీరు, కనువిప్పు కలిగి ఆత్మహత్యను విరమించిన సంపన్నుడి కథగా ఆశాజనకంగా ఉంది.

ఉద్యోగస్తులకే తప్ప, ఉన్న ఊరిని, వ్యవసాయాన్ని నమ్ముకున్న పెళ్ళి కొడుకులకు పెళ్ళి సంబంధాలు కుదుర్చుకోలేక తల్లిదండ్రులు పడే ఇబ్బందిని “ఇప్పటికైనా మారాలి” అనే కథలో జి.వీ శ్రీనివాస్ సందేశాత్మకంగా చెప్పారు.

కుటుంబ బాధ్యతలు, ప్రేమ రాహిత్యంతో కొట్టుమిట్టాడుతూ చివరికి ఉన్న ఒక్క జీవితాన్ని తనకు నచ్చినట్టుగా జీవించడానికి ముందడుగు వేసే మహిళ కథే సుమన ప్రణవ్ రచించిన “ఒకే ఒక్క జీవితం “.




ప్రతులకు: శాంతి క్రిష్ణ,
సెల్: 9502236670

మత్తు పదార్థాల బారిన విద్యార్థులు పడకుండా ఉండాలని ఓపిక, సహనంతో తపించే ఉపాధ్యాయుడి కథగా ఉరిమిళ్ళ సునంద రాసిన “ఓజోన్ పొరలా “ బాగుండటమే కాక నేటి సమాజానికి అద్దం పడుతోంది.

ఓ ఉప్పు కాఫీ ద్వారా భార్యా భర్తల మధ్య పెనవేసుకున్న బంధానికి అక్షర రూపవమే “సుబ్రహ్మణ్యం వల్లూరి” రాసిన “అందమైన అబద్ధం “ కథ.

సుప్రసిద్ధ నవలా రచయిత “యండమూరి వీరేంద్రనాథ్” గారు రచించిన “కొండ మీది నక్షత్రాలు “ ఆధ్యాత్మికత వెనుక దాగున్న అసలు అంతరార్థాన్ని అందంగా చెప్పిన ఓ మంచి కథ.

తెలంగాణా సాంస్కృతిక నేపథ్యంలో, తోబుట్టువుల మధ్య సంపద సృష్టించే అగాధాలు, కొన్ని పట్టు విడుపుల ముచ్చటే “ఏనుగు నరసింహా రెడ్డి” రాసిన “గుట్టు” అనే కథ.

ఒక కవి నిజమైన గుర్తింపు కోసం చేసే ప్రయత్నంగా 'నరసిరెడ్డి' రాసిన “చేరాల్సిన చోటు”. ప్రేమ, ద్వేషం మధ్య నలిగే యువతి కథగా 'కృష్ణ కుమారి' రాసిన “తుషిమా” కథలు బాగున్నాయి.

కొందరి స్వార్థానికి ఏటేటా పెరిగిపోతున్న అనాథలను ఆదుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పిన వెంకట్ కంచిపాటి రాసిన”డాటరాఫ్ కృష్ణ మూర్తి”, మార్కులే ధ్యేయంగా సాగిపోతున్న నేటి విద్యా వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపే సూర్య ప్రసాద్ రాసిన “పంచ ప్రాణాలు” కథలు సందేశాత్మకంగా ఉన్నాయి.

ఓ వైపు రాజకీయ నాయకుల అవగాహనా రాహిత్యాన్ని ఎత్తి చూపుతూ, విద్యార్థుల ద్వారా “పాఠ్యాంశం “ లోని విషయాన్ని వాస్తవ పరిస్థితులకు అన్వయించిన అట్టాడ అప్పల నాయుడు రాసిన కథ బాగుంది.

జీవితపు చివరి మలుపులో తమకు నచ్చిన మరియు ఆహ్లాదాన్ని కలిగించే విషయాల వైపు అడుగేసే స్త్రీల కథలుగా అరుణ గారి “నెరవేరిన కోరిక”, స్వాతి శ్రీ పాద గారి “సాగనీ ఈ పయనం” కథలు ఆసక్తికరంగా ఉన్నాయి.

మారిపోతున్న కుటుంబ విలువలు, ఆచారాల నేపథ్యంలో ఒక ఆత్మ స్వగతంలా శ్రీధర్ బిల్లా “బెంచి “ , రోజు రోజుకు మారిపోతున్న సాంకేతికత నేపథ్యంలో భవిష్యత్తును ఊహించి రాసిన సలీం గారి “లెఫిబో “ కథలు కొత్తగా ఉన్నాయి.

ట్రాన్స్ జెండర్ భావోద్వేగాల నేపథ్యంలో తిరుమలశ్రీ “వాసన లేని పువ్వు” , తుఫాను లాంటి అనుకోని పరిస్థితుల్లో కూడా తమ చొరవతో ఇంటిల్లిపాది ఆకలిని తీర్చే మహిళామణుల కథగా శశికళ “వాళ్ళంతే “ కథలు బాగున్నాయి.

క్షణికావేశంలో ఇల్లు వదిలి మత్తు వ్యాపారాల ఊబిలో చిక్కుకుపోయే యువతకు కృపాకర్ “మరో బాటసారి” కథ హెచ్చరికలా ఉంది.

అంపశయ్య నవీన్ “వ్యామోహం”కథలో ప్రేమ వ్యామోహంలో పక్కదారి పట్టే యువతకు ప్రతిబింబంలా ఉంది.

మాయమైపోతున్న మానవత్వపు స్పర్శను సుగుణారావు “స్పర్శ “ కథ గుర్తు చేస్తే, తాత్కాలికంగా కలిగే భావోద్వేగాల వల్ల కలిగే అసంతృప్తిని దూరం చేసే మార్గాన్ని రాంబాబు “రీఛార్జ్” కథ చూపెడుతుంది.

సహజంగా అత్తా కోడళ్ళ మధ్య ఉండే అపార్థాలను, అడ్డుగోడలను దాటుకుని కలిసిపోవడానికి ప్రయత్నించే గాయత్రి “మనసెరిగిన అత్తగారు “ కథ ముగింపు బాగుంది.

ఈ కథా సంకలనం సంపాదకురాలు శాంతి కృష్ణ “మనసుతో రాయబారం “ కథ పరిస్థితుల వల్ల దూరమైనా , మరలా చేరువడానికి ప్రయత్నించే ప్రేమికుల మనసుకు అద్దం పట్టేలా భావుకతతో నిండి ఉంది.

ఇందులోని కథలు చాలా వరకు వాస్తవికతకు అద్దం పట్టేలా, తగిన పాళ్ళలో కాల్పనికతను జోడించబడి ఆసక్తికరంగా ఉన్నాయి . ఇటువంటి వైవిధ్యభరితమైన కథా కడలిలో, నేను రాసిన “జనులా పుత్రుని పొగడగా “ కథకు అవకాశం కల్పించిన తెలుగు సాహితీ వనం వారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.



**- సుధా కళ్యాణి**
హైదరాబాద్

పుస్తక సమీక్షలు

# గొట్టిగఖుర్దు విద్యార్థుల గట్టి మణిపూసలు

ఒక్కోసారి అనిపిస్తుంది. చదువుకుంటున్న పిల్లలకు రచనా వ్యాసంగం అవసరమా? అని. ఎందుకంటే ఊహాజనితమైన ఆ కళ చదువుకోవాల్సిన పుస్తకాలలోని విషయాలను ఆకళింపుచేసుకోవడంలో ఏదయినా ఇబ్బంది కలుగుతుందా అని. మేము ఏదో కవిత్వం రాసేస్తున్నాం. మాకన్నీ వచ్చేసాయి అనే ఆలోచనలో పడతారేమోనని. మరొక్కసారి అనిపిస్తుంది. చదివే పిల్లలకు ఆలోచనల్ని పెంపొందించే వ్యాపకంగా పనికొస్తాయని. సమాజంలోని కష్టనష్టాలను, ఆవేదనలను, ఆనందాలను వెదికి పట్టుకోవడానికి ఎంతో ఉపయోగపడతాయని. అసలు జీవితం పట్ల ఒక నిర్దిష్టమైన అవగాహన ఏర్పడుతుందికదాని.. ఒకవిధంగా రెండోదే నిజమనిపిస్తోంది. ఎంతసేపూ పాఠశాల పుస్తకాలే కాకుండా తనలోని సృజనాత్మకతను వెలికి తీసే ప్రయత్నం అవసరం. ఒక చిత్రకారుడు చిన్నతనం నుంచే తనకే తెలియకుండా చిత్రాలు వేస్తుంటాడు. ఒక పాటగాడు తనకు తెలియకుండా స్కూలు ఆవరణలో, ఇంట్లో పాటలు అలవోకగా పాడేస్తుంటాడు. అలాగే సాహిత్యం కదా? నిజంగా రచన పట్ల ఆసక్తి వున్న విద్యార్థులు వందలో పదిమంది వున్నా వాటిని పెంపొందించుకోవడానికి ఎంతో వుపయోగపడుతుంది అని. తనలోని సృజనాత్మకతను వెలికితీసే క్రమంలో వేరే ఆలోచనలు చేసే నెపం కానీ, సమయాన్ని వృథా చేయడం కాని ఉండదని అనిపిస్తుంది.

ఈ విషయంలో వడిచర్ల సత్యం చేస్తున్న కృషి ఎంతో గొప్పది. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలోని గొట్టిగఖుర్దు ఉన్నతపాఠశాలకు చెందిన 45 మంది ఆణిముత్యాల్లాంటి విద్యార్థుల నుండి చందోబద్ధమైన ఒక్కొక్కరి నుండి పదేసి చొప్పున 450 నూతన ప్రక్రియ మణిపూసల్ని రచింపజేయడం వాటిని ఎంతో ఆర్థికపరమైన వ్యయప్రయాసలకోర్చి గ్రంథరూపాన్ని ఇవ్వడం నిజంగా ఆనందదాయకం.




**-ప్రతులకు:** వడిచర్ల మమత
ఫోన్: 94413 50137

అది కూడా ఈ గ్రంథం వందవ గ్రంథం కావడం మరింత ఆశ్చర్యంగా వుంది. మరి లోకం పోకడ పూర్తిగా ఎరుగని, అమాయకపు పసిపిల్లల మెదళ్ళలో కలిగిన భావాల్ని మచ్చుకి ఒక్కసారి పలకరిద్దాం..

**“అమ్మ నాన్న ప్రేమలో/ గురుదేవుల బాటలో/ పయనించిన వారెప్పుడు/ విజేయులౌతురిలలో”**

**“అమ్మను పూజించనోడు/ నాన్నను ప్రేమించనోడు/పుట్టినేమి? గిట్టినేమి?/ గురువుమాట విననివాడు”**

**అంటున్న విద్యార్థి జె.భవాని // “పచ్చ పచ్చని పొలాలు/ తీరుస్తాయి కరువులు/ కొని తెచ్చుకున్నట్లుగా/ చెట్లు నరికితే యిడుములు” // “మొక్కలను నాటాలి/ చెట్లుగాను పెంచాలి/ భూమాత మదినిండ/ ప్రశాంతిని నింపాలి”** అంటున్న విద్యార్థి భానుశ్రీ, **“రైతే మన దేవుడు/ గురువే మన దేవుడు/ ప్రాణాలను కాపాడే/ వైద్యుడే మన దేవుడు” అంటున్న విద్యార్థి నవనీత,// ప్రేమ పేరు చెప్పుకుని/ మనసులోన ముర్చుకుని/ లేచిపోయిరి ప్రేమికులు/ కన్నపేగు తుంచుకుని”** అంటూన్న నాగ్ అనే తొమ్మిది చదువుతున్న విద్యార్థి మాటలు నవ్వు వచ్చాయి. అపుడే ఎంతలేసి మాటలు కదా? అనిపించింది. జీవితంలో ప్రేమ పాత్ర కన్న పేగును తుంచుకోకూడదు అనే ఆలోచన కలిగినందుకు సంతోషం.

పైగా ఈ విద్యార్థి సొంతంగా పుస్తకాన్ని ప్రచురించిన తొలి విద్యార్థి అవ్వడం గమనార్హం. మరొకచోట కె. శివలీల అనే విద్యార్థి ఇలా అంటుంది. **“ఫోనులోన మంచివుంది/ ఫోనులోన చెడ్డ వుంది/ అత్యవసరమైనట్టి / ఫోనులోన సర్వముంది” అని. “ చదువు విలువ తెలిసినోళ్ళు/ టైము విలువ తెలిసినోళ్ళు/ విజయాలను పొందుతారు/ సాధనమును చేసినోళ్ళు”** అంటూ కొత్తూరు ప్రత్యూష . ఇలా అనేకమంది విద్యార్థులు శిరీష, విజయలక్ష్మి, నీలిపల్లవి, శరత్‌చంద్ర, మధుసూధన్, కవిత, అనిత, శ్రీశైలజ, నిఖిత, పూజ సునీత, జ్యోతి, గాయత్రి, మల్లేశం, రాధిక, రమేష్, నిశితారెడ్డి, గౌతమ్ చవాన్, అనూష, నరేష్, వాణిశ్రీ, జగదీశ్వరి, భాగ్యలక్ష్మి, హన్సిక, సవిత, స్వప్న, నాజియాబేగం, ప్రవీణ్, రాథోడ్ నందిని, దివ్య, నవ్యశ్రీ, నాగజ్యోతి మహేష్ గౌడ్ మొదలగు విద్యార్థులు తల్లితండ్రుల పట్ల, ప్రకృతి పట్ల, గురువుల పట్ల తమ వున్నతమైన భావాలను వ్యక్తీకరించడమే కాదు, జీవితం పట్ల కూడా తమదైన అవగాహనను అందంగా అక్షరీకరించిన వీరు నిజంగా ఆణిముత్యాలే.

ముఖ్యంగా వీరందరికీ ఒక కవితాప్రక్రియను చందోబద్ధంగా తెలియజేసి రచింపజేసిన వడిచర్ల సత్యం గారికి మన:పూర్వకమైన అభినందనలు.

ముఖ్యంగా జిల్లా విద్యాధికారి జి.రేణుకాదేవి గారు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సి,పార్వతీదేవి గారు, పి.నర్సింగ్‌రావు గారు, తెలుగు భాషోపాధ్యాయులు డా॥మున్నూరు రాజు, సాహిత్యఅకాడమీ అవార్డు గ్రహీత డా॥ పత్తిపాక మోహన్ వంటి వారు ఎంతో బాధ్యతాయుతంగా ముందుమాట రచించడం ఎంతో ఆకర్షణీయంగా వుంది. విద్యార్థుల పట్ల, వారిలోని సృజనాత్మకత పట్ల వారికున్న ఆసక్తికి జోహార్లు.



**-శైలజామిత్ర**
9290900879

# వర్ణాంతర సంధ్యలో ప్రపంచమే ప్రకాశిస్తుంది



**- డా॥ కత్తి పద్మారావు**
9849741695

అరేబియా సంద్రంలో
ప్రయాణిస్తున్న నౌక
సుగంధ ద్రవ్యాలతో ఘుమఘుమలాడుతుంది
పడవకు కట్టిన తెరచాపకు
ఓ నక్షత్రం దిక్సూచిగా మెరిసింది
సూర్యోదయాన్ని బట్టి
దిక్కులు నిర్ణయిస్తున్న నావికుడు
జీవన సంక్షోభంలో
నేటి బతుకు పడవ
దిక్సూచి లేని ప్రయాణం
కడలి గర్భంలో ఉన్న చేపల గుంపుల్లో కలవరం
అగ్నిపర్వతాలు అంతరంగం నుండే పుడుతున్నాయి
కుటుంబం వైరుధ్యభరితంగా ఉంది
మనుషుల అభిరుచుల మధ్య ఘర్షణ
కొత్తపుంతలకు అడ్డుగోడలు
చెరువులు నాచు పడుతున్నాయి
కాలువలకు పూడిక తీయక
పంటలు ఎండిపోతున్నాయి
కంకి ఫలించక ముందే రాలిపోతుంది
దాహార్తిని మత్తుమందుతో తీర్చుకుంటున్నారు
గుండెకు చిల్లులు పడుతున్నాయి
మనిషిలో మృగం తొంగి చూస్తుంది
పాలకుడు రుగ్మతకు
అయువు పోస్తున్నాడు!
మరో ప్రక్క ఆ యవ్వనుల
జీవన యానం
ఓ మధుర గానంలా సాగుతుంది
పాడుతున్న ఆ గంధర్వకాంతకు
ఫ్లూట్ వాయిస్తున్న అతడి
శ్వాస తగులుతుంది
ఆ యువతి కాళ్లు తడుపుకుంటున్నప్పుడు
అలలు మునివేళ్ళతో మాట్లాడుతున్నాయి
ఆమె తలార స్నానం చేశాక
కురులు ఆమెతో ముచ్చటిస్తున్నాయి
ఔను ! ఇప్పుడు ఆమె తనతోనే
తాను మాట్లాడుకోగలుగుతుంది.
ఆమె ప్రతి కదలికలో
ఒక భావనా చాతుర్యం ఉంది.
ఆమె విరబూసిన తోటలో విహరిస్తుంది?
ప్రతి చెట్టులో పొటమరిస్తున్న
చిగురాకు లో ఉన్న మృదుత్వం
ఆ యువతిని ప్రశ్నిస్తుంది.
జీవితంలోని రంగుల వలయాలను
అంతరాంతరాల్లో దాగిన వెన్నెల
తరగలను చూడమని చెప్తుంది.
ఇప్పుడు తనకి తానే
ఓ స్నేహితురాలు.
ఈ నిర్వేదితులు ఎందుకు
ఆ జవ్వని అడుగు చప్పుళ్లకు
బెదిరిపోతున్నారు?
వీరు తగిలించిన
ఇనుపకచ్చడాలను
ఆమె ఛేదించిందనా ?
వీరు వీక్షించలేని చిత్రాలకు
ఆమె రంగులద్దుతుందనా ?
వీరు దర్శించలేని శిల్పాలలోని వన్నెలను
ఆమె చూపులు అందుకుంటున్నాయనా ?
ఎందుకు ఆమె అంతర్వీక్షణకు వీరు
నిర్వీక్షకులవుతున్నారు?
ఆమె మేఘాల మీద నడిచేటప్పుడు
విద్యుత్ వలయాలు
ఆమె చరణాలకు కాంతులద్దుతున్నాయి.
మీరు పేర్చిన చితి మంటలలో నుంచి లేచిన
చితాభస్మం నుండే
ఈ చైతన్య జ్వాల ప్రభవించింది.
మీ గణిత శాస్త్రమంతా ఆమె
ముని వేళ్ళ మీద నాట్యం చేస్తుంది.
మళ్లీ మీరెక్కడో మంటలు వేస్తున్నారు కదా!
ఆ మంటలు
మిమ్మల్నే తోసే చైతన్యం ఈనాడు ఆమెకుంది.
నిజమే! నేను డర్బన్ నుండి
జాన్స్ బర్గ్ వెళ్లే విమానంలో
ఒక తెల్ల భామ, ఒక నల్ల యువకుడితో
ఉన్న జోడీని చూశాను.
ఇప్పుడు ఫ్రాంఛైజెస్ అన్నీ
ఆ నల్ల వీరునికే కోట్లు పెట్టి కొంటున్నాయి.
అతనికి ముంబై విమానాశ్రయంలో
భారతీయ తారలు ఎర్రతివాచీ పరిచారు.
నిజమే !
ఆ ఆఫ్రిన్ సౌందర్యవతి పాదాలకు
వారు చెప్పులు తొడుగుతున్నారు.
ఆమె అందమైన గోళ్ళకు
వారు వంగి నెయిల్ పాలిష్ వేస్తున్నారు.
ప్రపంచమంతా ప్రతిభకు
దాసోహమవుతుంది.
ఆకాశ అవనిక పై
విజయ పతాకలు ఎగురుతున్నాయి.
ఆ సవర స్త్రీ ఎప్పుడో
తన మట్టెల మోతలతో
పులులను లొంగదీసుకుంది.
ఆ కోయ భామ ఏనుగు మీదెక్కి
ఆడాడే రాజసం చాటింది.
ఆమె తలలో గుచ్చుకున్న
నెమలి ఈక
జాత్యహంకారానికి గుర్తు.
దేశ దేశాల్లో సైనిక కవాతుల్లో
స్త్రీ గణ రణ చరణ విన్యాసం!
ఎందుకు ఆ సాంప్రదాయ పితృడు
భయపడుతున్నాడు?
తన కుమార్తె గీత దాటుతుందనా ?
ఆమె అక్షరాలనే కాదు,
ప్రపంచాన్నే చదువుతుంది.
పుస్తకం మస్తకం
అంతః స్సంబంధితాలని తెలుసుకుంది.
జీవితంలో విద్యను,
విద్యలో జీవితాన్ని చవిచూస్తుంది.
ఎందుకు మీరు తల్లి బతికున్నప్పుడు
ఒక ముద్ద అన్నం పెట్టకుండా
ద్వాదశ దినాలు పిండ ప్రదానం చేస్తున్నారు?
ఆ నిప్పు కణికలతో
మాంసం కాల్చిన దేశంలో
యాగాల్లో నెయ్యిని ఎందుకు పోస్తున్నారు?
అందుకే నీ కూతురు
ఆ మంటల్లో నుండే
నీల వరుణుణ్ణి ప్రేమించింది.
మీ సుత నూత్న సృష్టికి ఆయువులుపోస్తుంది.
ఆమెకు పుట్టిన సుతుడు గంధర్వుడయ్యాడు.
కర్ణుడూ అయ్యాడు.
సామాజిక ఘర్షణ నుండి
యుగకర్తలు పుడుతున్నారు.
ఆమె ఈనాడే కాదు,
ఆ నదీ తీరాన ఆ సత్యవతి
ఆనాడే వర్ణాంతరిత అయింది.
ఆమె తండ్రి శంతనుడు
ఆనాడే చక్రవర్తి.
నిజమే! ప్రపంచమే వర్ణాంతర సంధ్యలో
ప్రకాశిస్తుంది.
ఆ వర్ణాంతరిత ఆకాశంలోని
ఏడు రంగులను ధరించింది.
ఇది ఆమె యుగం.
ఆమె మేల్కొంది.
ఆమె గమిస్తుంది.
ఆమె ఉదయిస్తుంది.
ఆమె అంతరంగికమౌతుంది.
ఆమె నూత్న సృష్టికి ఆయువుల పోస్తుంది.
ఆమెతో నడుద్దాం.

## గె(పి)లుపు

పగలే గురక పెట్టి నిద్రిస్తూ
కలలు విపరీతంగా కంటూ
కూర్చొని ఎంచక్కా తింటూ
మాటల కోటలు కడుతూ
ఒంటికి విశ్రాంతి ఇస్తూ
సోమరి బిరుదు పొందుతూ
చెమట కక్కడం మరిచిపోతే
గెలుపుకు దూరంగా నిలిచి
పేదరికాన్ని పెంచి పోషిస్తూ?
పాతాళ లోతులకు దిగజారుతూ
జీవచ్ఛవమై బతుకీడుస్తూ
ఊరికి దూరం చావుకు దగ్గరై
మనిషి అన్నదే మరుస్తున్నాం
అతీగతీ లేని బతుకు ఈడుస్తున్నాం!
శిశువు నడిచి పడిపోయినా
అడుగులు వేయడం మానలేదు
ఆడితే ఓడవచ్చని తెలిసినా
ఆడడం మరిచి పోలేదు
ఆడి ఓడినోడు అనుభవజ్ఞుడు
ఆడకనే ఓటమి అంగీరించినోడు
అసమర్థుల రాజ్యానికే మహారాజు!
గెలుస్తామనే రిస్క్‌తో ఆడుతూ
సుదూర గమ్యాన్ని దర్శిస్తూ
అపనమ్మకాన్ని పాతరేసి
పిరికితనాన్ని చీల్చి చెండాడి
ఓటమి భయాన్ని ఆమడ తరిమి
స్వీయ సామర్థ్య పెట్టుబడి పెట్టి
గెలుపు పిలుపును వింటూనే
అపూర్వ విజయ తీరాలు చేరుదాం!
ఓటమిని గుణపాఠంగా చేసుకొని
అనుభవ నిధిగా మదిన దాచుకొని
పాత దారిన గొర్రెల్లా పోకుండా
ఆలోచనకు సృజన జోడించి
వినూత్న దారులకు పట్టం కట్టి
అసాధ్యాల్ని సుసాధ్యం చేస్తూ
స్వప్నాల్ని సాకారం చేసుకుంటూ
గెలుపు పిలుపును ఆలకిస్తూ
విజయ ఘంటికలు మోగిద్దాం!.



**-మధుపాళీ**
9949600037

## ఇల్లు ఇల్లాలు

ఇల్లు వెలిగిపోతుందంటే
ఇల్లాలు ఇంటిలో దీపంగా ఉన్నట్లే
ఇల్లు ఆనందంగా ఉందంటే
ఇల్లాలు ఇంటిలో ప్రేమానురాగాలు పంచుతున్నట్లే.
ఇల్లు సిరులతో తూగుతుందంటే
ఇల్లాలు ఇంటిలో లక్ష్మీదేవిగా అవతరించినట్లే
ఇల్లు ఒకతాటిమీద నడుస్తుంటే
ఇల్లాలు గణనీయమైనపాత్రను పోషిస్తున్నట్లే.
ఇల్లు సమాజంలో గౌరవమర్యాదలు పొందుతుంటే
ఇల్లాలు బరువుబాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నట్లే
ఇల్లు పలుశుభకార్యాలకు ఆలవాలమైతే
ఇల్లాలు తన సమర్థతను చాటుకున్నట్లే.
ఇల్లు స్వర్గసీమను తలపిస్తుంటే
ఇల్లాలు దేవతాపాత్రను పోషిస్తున్నట్లే
ఇల్లు బంధువులకు నెలవైతే
ఇల్లాలు
చక్కని అనుబంధాలను సాగిస్తున్నట్లే
ఇల్లు చక్కని నిర్ణయాలకు తావయితే
ఇల్లాలు మంచి సలహాలను ఇస్తున్నట్లే
ఇల్లు పూజాపునస్కారాలకు
స్థావరమయితే
ఇల్లాలు దేవునికృపకు
పాత్రురాలయినట్లే
ఇల్లు
ఆలయమయితే
ఇల్లాలు
అందులోదేవతే.



**-గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్**
సెల్: 7981616630

# నగరానికి చిక్కిన నదీ ఇకనుంచైనా ప్రవహించేవా?



-విద్యాసాగర్ అంగలకుర్తి
9676001230

ప్రతి వానకు పాత గాయాలు సెలవేస్తున్నా.....
ప్రతి వానకు పాత గాయాలు సెలవేస్తున్నన్నా
ఏవో ఆశలు చిగురిస్తున్నాయ్ .
ఎనుములీదగల ఇంకిపోని నది
ఇకనుంచైనా ప్రవహించేనని.
నదీ నగరం కవలలుగా ఎదిగే నవీన రీతులు ప్రభవిస్తాయని
నగర జీవనం నలుగురికందే నిజమవ్వాలని
కొందరి కోసం నగరం మిగిలే కురచ బుద్ధులిక కొనసాగవనే
సద్భావనలు స్ఫురిస్తు వున్నాయ్!
మాసిన మజ్లిన్ను మసి బట్టగ వాడమని
నమ్మ బలికే నిపుణుల నడమంత్రపు తెలివికమ్ముడు బోయి
తమను నమ్ముకున్న జనం ఉసురు తీసేసే
జన వంచకులు పాలకులైనంత కాలం
పాతకాలే పాలనగ మారిన మిడి మిడి బేరాల రాయుళ్ళ
గళ్ళా పెట్టెల గల గలలు .
చేతికందినది సైతం నోటికందని నిర్భాగ్య స్తితిగతులు ప్రజల పాలు.
అలవాటుగా మారిన అవస్థల బ్రతుకులో అంచెలంచెలుగానైనా
అసలైన ఆమని చేరువౌతుందనే మాట
అదే పదివేలు.
కాయకల్పమైనా దరి చేరుతుందను పలుకే తేనె చినుకు!.
మధ్యాన వేళకే గాఢాంధకారం ఆవరించేందుకు
అద్భుతమేదో అంబరపు సయ్యాట కానవసరం లేదు
చెట్టు చేమను నదిని చేతులారా మనం చెణికితే చాలు.
తుదిర్ఘూము చీకట్లు ముసురు మబ్బులతో కలిసి
రోజంతటిని కాళ రాత్రిగా మార్చక ముందే
రేపటి దీపాలకు చమురు సమకూర్చుకోవాలి.
పది కాలాలు మనగలుగు మానసిక పరిణతి
మనం పెంచుకుంటే చాలు .
బేర సారాల ముడులకు పొదిగిన తళుకు బెళుకులకు సమ ఉజ్జీగా
కొత్తగా నదిని నిలబెట్టే యోచన సముచితంకాదు–
నదీ తీరాలను మించిన సౌందర్య రాసులనెవరు సృష్టించ గలిగారు?
ఒకొక్క తీరం భువి వెలిగించిన ఒక మణి దీపం.
అన్ని రుతువులూ ఆనంద నిలయాలే అక్కడ!.
ప్రతి ఆకు ప్రతి పిందె సౌందర్యానికి తలకట్టు
కొమ్మలు గాలికి సరిగమలు నేర్పేది అక్కడే !
పిట్టల కువ కువలే ఇరు సంధ్యలలో సంగీత విభావరులు
పచ్చల గుట్టైన పచ్చని చెట్టుకు సరి తుగలేదు . 34
నది తరగలపై చిరు గాలి నాట్యాల మించిన
సుకుమార గీతాలు నువు కూర్చగలవా ?
జల జల పారే జలబిందువులకు ఇంద్ర నీలాలెన్నైన సాటి రాగలవా?.

నగరానికి మూలం మూల్యం నదైనప్పుడే కదా!
నా నగరమిదీ అని తలెత్తుకు తిరిగే తరుణం
నగరానికి మూలం మూల్యం నదైనప్పుడే కదా !





నది లేని నగరమది దాహం తీరని జన సాగరమే !
సదా ఆశ్రయమవని అభద్రతా నిలయమే !.
ఆ చింత చెట్టు సాక్షిగా నీ వొడిలో జలకాలాడిన నాడే
నీ తీరాలన్నిటినలంకరించే మధురోహలు చేసుంటాడు
నీకో మణి మాణిక్యాల కంఠ హారం చదివిస్తానని మాట ఇచ్చుంటాడు
నవ నగరానికి పురుడు పోసిన వాడు.
అనంత గిరులలో పుట్టీ వాగులు వంకలను తోబుట్టువులను చేసుకునీ
ఈసీ తో నెయ్యం కట్టిన నువు నగరానికి
నడిబొడ్డై నింగీ నేలా ఉన్నందాకా నిలవాలని
నీ ఇరు చెరుగులు ఇసుక రేణువులంతగా జనమయమవాలని
ఆకాంక్షిన వాడి ఆశకు అంకురం నువ్వు !.

అడ్డంకులెన్నింటినో అటు ఇటు తోసేసి
బుడి బుడి నడకల పసి పట్టణానికి
పసిడి ధారవై ప్రవహించిన నాడీ నగరానికి తెలియదు
నువు తనకు పుటకనిచ్చావనీ పెంపూ పోషణ దాత వౌతావనీ !.
ఎన్ని చెరువుల కడుపు నింపావో !.
ముచికుందవై నలగొండకు ముదమందించే
ముక్కారు పంటలకు ప్రాణం ప్రణవమైనావో
ఎన్ని గ్రామాల దాహం ప్రేమగా తీర్చావో!
నగరంగా మారిన నదివీ నువైనావు!.
మరి ఇపుడేవీ నీ వైభవ చిహ్నాలు?
నీ ఇరు దరులపై ఎదిగిన పాడిపంటల తోటి ఆ పసిడి గనులు ?
నీ వొడ్డున వెలసిన నికుంజాలు వాటికలలో





తమితో కూడిన లెక్కకు మించిన
ముసి ముసి నవ్వుల లేప్రాయపు జంటలు ?
పైర గాలి మిషకు రెప రెపలాడిన
త్రుణ ధాన్యాల సిగ వూయలలేమై పోయాయి ?
కుడి ఎడమల నొకే తీరుగా పోషించిన హరిత కళాసీ!
తల దించుకున్న దుక్ఖ ముఖం నీదేనని నమ్మగలనా మూసీ ?.
నాకూపిరి మీరు పోసేరా...,,,,?
ఏమని చెప్పను నగర నివాసీ
నా బాగోగులపై మనసు పెడుతున్న పచ్చదనాల ప్రగతి పిపాసీ !
నింగి తండ్రికి నేల తల్లికి అనుంగు పుత్రిని నేను
ప్రక్రుతి ఒడిలో పరిసరాలు కూర్చిన కావ్యం నేను
తన గమనం లో నను గమనించ
ప్రతి క్షణం నే పరిశుద్ధంగా ఉండాలని
ఒక రుతు కాలాన్నే నాకంకితమిచ్చిన నేలమ్మకు బిడ్డను నేను
ప్రతి వర్షం నా స్వచ్ఛత కోసం
ప్రతి ఏడూ నను నేనభిషేకించుకునే తరుణం కోసం
ప్రవాహపు ప్రతిరూపం నేను
ప్రవాహ శీలం పరిశుద్ధత విడదీయలేని కవలలు కాదా!?
గోల్కొండ దాటుకొని ఘోషా మహలు, హయాత్నగర్ల సివార్లు తడిమి
బాట సింగారం అంచులు తాకుతున్నావొక పక్క
కోకా పేటను కొంపల్లిని కలుతున్నావింకొక పక్క
బోడుప్పల్ నుంచి భువనగిరిదాక వడివడిగా అడుగులు వేస్తున్నావు
నాలుగు చెరుగుల నవీన రీతుల నావిష్కరించే
నవ్య ప్రపంచపు నాణ్య నగరమా!
ఎదిగే కొద్దీ పచ్చదనం ప్రశాంతినొదలక
పదికాలాలొదిగే జనాశ్రయమై వర్ధిల్లేవా ?
నీ మూలాలను నువు మరిచావని చెప్పేందుకు
నీపై నాకే అసూయ లేదు

అధునాతన జీవన సరళికి నగరాలను మించిన మార్గం
లేదను జ్ఞానం కొరవడిన వాణ్ణి కాను.
చెప్పక తప్పని వగ నాది.
నా బ్రతుకును వాడ్చే నాగరికత శగ నీది.
వగలూ శగలూ ఎన్నాళ్ళని సయోధతో అవి మనగలవు?.
నలభయ్యేళ్ళుగ నివాసమున్నా ఈ నగరం నాదని చెప్పుకోలేను
మాకందనిదైనా నిన్నొదలలేమని విలపించిన వారికెందరికో
నీ ఒడిలో నాల్గడుగుల చోటిచ్చావు
తల దాచుకొమ్మనే నీ నామరూపాలకు నామం పెట్టే
నగర ప్రభువులకు నిను వంచించిన వాడిగ నేనే కనిపిస్తున్నాను.
నీ దాత్రుత్వానికి డాగు నే కాకూడదని నిన్నొదిలి వెళిపోవాలో
పరువూ ప్రతిష్ట మాటున నంగనాచిలా దాగిన
సంపద జాఢ్యం విజ్రుంభించిన
నగర పాలకుల నటనకు నే బలి కావాలో పాలుపోవడం లేదు.
అమ్మనొదిలి తానుండలేని పసి బిడ్డడినైనా
నీ పూర్వపు రూపం, గడిచిన దినాల నీ ప్రవాహ దీప్తి
కళ్ళారా చూడాలని నే చేయి వదిలినా
నివు మునుపటిలా తళ తళ మెరిసే అలల నగలతో
నీ ఒడ్డున పెరిగిన మహా వ్రుక్షాల కొమ్మల వూయలూగే
పిట్టల గుంపులు తిరిగొస్తాయా?
నీ ఒడిలో సేద తీరిన పిల్లా మేకా మళ్ళీ కళ కళ లాడేనా?
తల్లిని చంపే తనయులా ఈ నగరాలు?
తండ్రిని చంపి సిమ్హాసనమెక్కే అధికార లాలసకు వారసులా?
నదులను చంపి, చెరువుల తుంపి
సరోవరాల సమ్మార్గానికి సందేహించని
సంపద మౌఢ్యం పట్టిన కాళ్ళ ముందుకు మించి చూడలేని
హస్వ ద్రుష్టుల ఏ నవ సాంకేతిక ప్రగతొక అగ్ని గుండమై
కనరాని గండమై మూసీ జలధారలనార్పి వేసేనో?
ఒకింత జాగా కోసం
వొత్రి వొత్రి వడి చేర్చిన వాణ్ణే వెలపల నెట్టేసిన ఒంటెలా
ఎన్ని చెరువులాగమై పోయాయో?
విశ్వాస ఘాతుక ధర్మం
నగరం పేరిట నదినే బలి తీసుకుంటున్న వైనం!
వ్రుశ్చిక సంతానమై పోయామా?
ముత్తాతల ప్రతిష్ట కూల్చే మునిమనవళ్ళయ్యాం చూడు
నీ గుణమెందుకని మా బుద్ధికందదో సెలవిస్తావా ?
మూసీ పేరిట మరో సారి నీ వాసికి తగ్గని వికాసంపై
ధ్యాస పెట్టమని పెను ఆశతో నిన్నడుగుతు వున్నా!
పేరాశ నీదని నను కొట్టి వేయకు
వేర్లకు ముప్పు వాటిల్లిన నాడు చెట్టుకు క్షేమం కొనసాగేనా ?

## పరిచయం

తెలంగాణ ప్రాంతం నాడు నిజాం రాజరిక పాలనలో ఉండటంవలన, ఇక్కడి ప్రజలు నిజాం నియతృత్వ ధోరణిలో మగ్గుతున్నారు. ఈ ప్రాంతంలో అధిక సంఖ్యాక ప్రజలు తెలుగు వారు అయినప్పటికీ, వీరి మాతృభాష తెలుగుకు ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వక, పాలకుల భాష అయిన ఉర్దూ రాజ భాషగా ప్రకటించినారు. ప్రభుత్వ పరిపాలను ఉర్దు భాషను అన్ని స్థాయిలలో అమలు చేసవారు. ఇటువంటి నిజాం నిరంకుశ పరిపాలనలో తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయలు, కటిక చికట్లలో కొట్టు మిట్టాడుతున్నప్పుడు వెలిగిన ఒక కాంతి పుంజం శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాష నిలయం.

## పూర్వ సంఘటన

కొమఱ్ఱాజు లక్ష్మ గారావు, రావి చెట్టు రంగారావు, నాయని వెంకట రంగారావు 1901 సంవత్సరంలో ప్రచురితమైన " రాబర్ట్ సివేల్ '' రచించిన " ఫర్ గాటన్ ఎంపైర్ " అనే గ్రంథాన్ని పఠించటము వల్ల శ్రీకృష్ణదేవ రాయల శౌర్య పరాక్రమాలు, రాజనీతి, దురంధరత్వం , సంస్కృతాంధ్ర సాహిత్య సేవ, వారి ఆస్థానంలో అష్ట దిగ్గజములను ప్రఖ్యాతి చెందిన పండితుల కవుల ప్రతిభ అవగతమై ఆనంద తన్మయులైనారు.

ఆహా! ఇటువంటి ఆంధ్రభోజుని మరచితిమి కదాయని బాధపడినారు, ఆ సందర్భంలో నిజాం రాష్ట్రపు ఆంధ్ర భాషకు ఎటువంటి దుర్గతి పట్టెను గదాయని వాపోయినారు . శ్రీకృష్ణ దేవరాయల వారి పవిత్ర నామమును చిరస్మరణీయము చేయవలెననీ, తలంచి తెలుగు భాషకు పూర్వవైభవమును సాధించవలెనని భావించినారు. దీని ఫలితంగానే ఈ మహా సంస్థ ఉద్భవించింది.

## భాషా నిలయం స్థాపన

1901 సెప్టెంబర్ 1 ఆదివారం సాయంత్రం 5 గం॥లకు, రావి చెట్టు రంగారావు, పార్థసారథి అప్పారావు, రాజా నాయని వెంకట రంగారావు, కొమర్రాజు లక్ష్మణరావు, మైలవరపు వరసింహశాస్త్రి, బారిస్టర్ రాజగోపాలరెడ్డి, కొత్వాల్ వెంకటరామిరెడ్డి, ఆదిపూడి సోమనాథరావు, ఆదిరాజు వీరభద్రరావు, డా॥ గోవిందరాజులు నాయుడు, రఘుపతి వెంకటరత్నం నాయుడు, శ్రీనివాస చారి, మొదలయినవారు. నల్లగొండ జమిందారు రావి చెట్టు రంగారావు గారి జాగిర్దార్ బంగ్లాలో సమావేషమై, పరాక్రమ శాలి, సాహిత్య పోషకుడు, ఆంధ్రభోజుని పేరు మీదుగా "శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం' స్థాపించటం జరిగింది.

## నామ ఔచిత్యం

ఈ సంస్థకు గ్రంథాలయం అనికాక భాషానిలయం అని నామకరణం చేయటంలోనే ఒక విశిష్టత గోచరిస్తుంది. దీనిని కేవలం గ్రంథాలయంగా నిర్వహించక, దీని ద్వార సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, తెలుగు భాషాభివృద్ధికి సాంస్కృతిక అభ్యుదయానికి పాటుపడాలని స్థాపకుల ఆంతర్యం గోచరిస్తుంది.

అందుకే నాటి వ్యవస్థాపకులు ముందు చుపుతో విస్తృత అర్ధం వచ్చేలాగా ఈ సంస్థకు " శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం " అని నామకరణం చేయడం జరిగింది. అందుకే ఈ సంస్థ మిగతా గ్రంథాలయాలలాగ కేవలం గ్రంథాలను సమీకరణ చేయటమే కాక వివిధ సాహిత్య కార్యక్రమాలు నిర్వహించి తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని కృషి సలిపినది.

## స్థలం ఎంపిక

నిజాం రాజధాని హైదరాబాదులో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం స్థాపన ఒక చారిత్రాత్మక సంఘటన. అయితే స్థల ఎంపిక కూడ మరొక అద్భుతం అని చెప్పవచ్చు. నూటా ఇరవై రెండు సంవత్సరాల కిందట హైదరాబాదులోని సుల్తాన్ బజార్ " బ్రిటిష్ రెసిడెంట్ " నివసిస్తున్న ప్రాంతం, మరొపక్క" కింగ్ కోఠి తదితర రాజ ప్రసాదాలున్న ప్రాంతం ఈ రెండు ప్రాంతల మధ్య " రామ కోఠి కలదు. ఈ ప్రాంతానికి రాష్ట్రంలో అన్ని ప్రాంతలనుంచి పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి పోతుంటారు. ఇక్కడ ఏవిషయమైన జరిగితే ప్రజలలోకి వెళుతుంది. కాబట్టి నాటి భాషానిలయం స్థాపకులు ఈ ప్రదేశాన్ని ఎంచుకోవడం జరిగిందని చెప్పవచ్చు.

## ఒడిదుడుకులు

రోజు రోజు ప్రజల ఆమోదం పొందుతూ దినదినాభివృద్ధి నొందుచున్న శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయలమును, మూసి నది హైదరాబాదు నగరాన్ని జలప్రళయంతో ముంచి వేసినట్లు 1910లో మద్రాసు నందలి అర్బత్ నాట్ కంపెనీ దివాలా ధన ప్రళయం భాషానిలయంను ముంచివేసినది. గవ్వ గవ్వా




కూడ బెట్టుకొన్ని రొక్కం 726-10-6-లు ఈ ప్రళయానికి గురి అయ్యి తీరని నష్టం జరిగింది. అంతకన్న గొప్పనష్టం, నిలయాన్ని స్థాపించి పోషించిన ఉదార వంతుడు, త్యాగశీలుడు, రావి చెట్టు రంగారావు గారు దివంగతులు కావటం. ఇది భాషానిలయనికి గోరు చుట్టు పై రోకటి పోటు వంటింది. ఇటువంటి వంటి నిరుత్సాహ పూరితమైన




వాతవరణంలో భాషానిలయం అభివృద్ధి కుంటుపడినది.

## భవనం కొనుగోలు

భాషానిలయం స్థాపించిన వారం రోజులకే రావిచెట్టు రంగారావు బంగ్లానుండి 1901 సెప్టెంబర్ 8 వ తేదినాడు తోటగుడెం బజారులో" హోలీ నాలుగు రూపాయల ఎనిమిది అణాలు " అద్దె ఇంటిలో భాషానిలయ కార్యక్రమాలు నిర్వహించటం జరిగింది.

రావి చెట్టు రంగారావు ఆకాల మరణం చెందటంతో ఆయన ధర్మపత్ని లక్ష్మీనరసమ్మ భర్త నడిచిన సేవ మార్గంలో నడిచి ఉదార హృదయంతో రూ. 3000/- విరాళం ఇవ్వడంతో సుల్తాన్ బజారులో ఒక పెంకుటింటిని కొనుగోలు చేయటంజరిగింది. దీనితో భాషా నిలయం మాటిమాటికి మార్చకుండా సొంత భవనం ఏర్పాటయింది.

## భాషానిలయ విస్తరణ

భాషానిలయం దినదినాభివృద్ధి చెందడంతో సభలు, సమావేశాలు, కవిసమ్మేళనాలు కవితా గోష్ఠులు, నాటక ప్రదర్శనలు మొదలైన సాంస్కృతిక కార్యక్రమాలు పెరగడంతో, సభికుల సంఖ్య క్రమంగా పెరగ సాగినది. ఫలితంగా భాషానిలయ విస్తరణ అనివార్యమైంది. సమర్థులు, కార్యదక్షులైన భాషానిలయ నిర్వహకులు భవన విస్తరణ ప్రయత్నంను కొనసాగించారు.

భాషానిలయం విస్తరణ గావించుటకు, భాషా నిలయానికి ఇరువైపులా ఉన్న ఇండ్లని కొనుగోలు చేయవలిసి వచ్చింది.

1932లో ఉత్తర భాగాన గల ఇంటిని 2545 రూపాయలకు , తరువాత 1938 లో పడమర దిక్కునగల ఇంటిని 2750 రుపాయలకు భాషానిలయం నిర్వహకులు కొనుగోలు చేయటం జరిగింది. వీటికి ఉత్తర భాగాన మరమ్మత్తులు జరిగాయి. పడమటి ఇంటిని పడగొట్టి హాలులో కలిపి విశాలవేదకను నిర్మించారు అప్పుడు ఈ నిర్మాణా వ్యయం 6351 రూపాయలు ఖర్చు అయినది. ఈ నిర్మాణానికి అర్ధిక సహాయం అందించిన వారు భాషా నిలయ అధ్యక్షులు అధ్యక్షలు రాజా నాయని వెంకట రంగారావు మరియు ఇతరులు కొంతమంది ఆర్ధిక సహాయం అందించారు. 1949 మార్చి 30 వ తేదీనాడు " వెన్నెల బలరామ్'' ప్రారంభించారు.

## ఆధునిక భవన నిర్మాణం

భాషానిలయం అధ్యక్షులుగా, మార్గదర్శకులుగా, వ్యవహరిస్తున్న కె.వి.రమణా చారి ఎ. ం.ా గారు ఆధునిక భవన నిర్మాణం కొరకు ఎంతో చొరవ చూపినారు.

ఫలితంగా 2002 సంవత్సరంలో భాషానిలయం నిర్వహించిన శతాబ్ది ఉత్సవాలలో పాల్గోన్న అప్పటి ముఖ్యమంత్రి గారు నారా చంద్రబాబు నాయుడు 30 లక్షల రూపాయాలను విరాళంగా ప్రకటిం చినారు.

దీనితో పెద్ద ఊపు వచ్చింది, తరువాత కలకత్తాలోని " రాజారామ్ మోహన్ రాయ్" పౌండేషన్ నుంచి 25 లక్షల రూపాయల సహాయం లభించినది. రాజ్యసభ సభ్యులు జి. సంజీవరెడ్డి ఓ.ఖ.నిదుల నుండి 10 లక్షలు, ఉప్పు నూతల. పురుషోత్తమ రెడ్డి అధ్యక్షతలోని తెలంగాణ ప్రాంతీయ కమిటి నుంచి 5 లక్షల విరాళాలు లభించాయి.

భాషానిలయం అధ్యక్షులు కె.వి.రమణాచారి ఎ. ం.ా గారు 2007 మార్చి 31 తేది నాడు నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినారు. రమణాచారి గారి పట్టుదల, శ్రద్ధాసక్తుల ఫలితంగా ఒక సంవత్సర కాలంలో నూతన భవన నిర్మాణం పూర్తి అయింది. 2008 ఏప్రిల్ 27వ తేదీనాడు రమణాచారి గారు ముఖ్య అతిధిగా నూతన భవన ప్రవేశం జరిగింది. ఇది భాషా నిలయం చరిత్రలో చిరస్మరణీయ సంఘటన.

భాషానిలయం యొక్క నూతన భవనం నాలుగు అంతస్తులు కలదు. ఆ నాలుగు అంతస్తులను భాషానిలయం నిర్వాహకులు చాలా చక్కగా విభజించి ఒక్కొక్క అంతస్తుకు ఒక్కొక్క విభాగాన్ని ? కేటాయించటం జరిగింది.

మొదటి అంతస్తు :- ఇందులో సభలు, సమావేశాలు, సదస్సులు తదితర కార్యక్రమాలు జరుగుతున్నాయి.

రెండవ అంతస్థు :- ఇందులో విజ్ఞాన భండాగారం వంటి గ్రంథాలయం కలదు

మూడవ అంతస్థు :- తరతరాల తెలుగుజాతి చరిత్ర, సంస్కృతి ప్రతిబింబించే ప్రదర్శనశాల.

నాలుగవ అంతస్థు ? లలిత కళాశిక్షణ కేంద్రం.

సెల్లార్ :- వాహనాల పార్కింగ్.

## పాఠశాల స్థాపన

శ్రీ మునగాల రాజావారి నిశ్చల ప్రేమ రావిచెట్టు రంగారావు, కర్పూరం పార్థసారథి నాయుడు గార్ల నిరంతర పరిశ్రమ వలన తెలుగు పాఠశాల యొకటి నెర్పాటు కావించబడెను . ఆర్థికముగా నిరుత్సహకరమగు




పరిస్థతులందు కూడా పాఠశాలను స్థాపించి, భాషా సేవకు పూనుకున్న వీరి ధైర్య సాహసములు ప్రశంసనీ యము.

ఇట్టి బృహతర కార్యంకోసం స్థాపించిన పాఠ శాల కేవలం 14 మాసములు నడిచి ధనాభావము వల్లనో, హెచ్చిన విద్యార్థుల సంఖ్యకు తగిన వ్యవస్థను, మరియు వసతులు చేయజాలక మరియు 1908 సం॥ లో మూసి నది ప్రళయం వలన హైదరాబాదు శ్మశాన వాటికగా మారినది, మరియు భాషానిలయపు సభ్యులు ఎన్నో కష్ట నష్టములు పడినారు. ఇట్టి విషమ పరిస్థితులలో పాఠశాల మూసివేయ అనివార్యమైనది.

## నాటక సంఘము

ఆంధ్ర భాషా వికాసమునకు అన్ని విధముల నిర్వహాకులు ప్రయత్నించు చుండిరి. దీని ప్రతిఫలంగానే "ఆంధ్ర భాషోజ్జీవన నాటక సంఘం" నూతనముగా నేర్పడి యుండెను. ఈ నాటక సంఘము వారి కోరిక పైన అది నిలయపు శాఖగా కొన్ని షరతుల మీద అంగీకరింపబడినది. కాని ఈ నాటక సంఘము వృద్ధిలోనికి వచ్చినట్లు కనబడదు.

## ప్రభుత్వ సహాయం

శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం మొదటి నుంచి నిరాడంబరంగా, బేషజరహితంగా నడిచింది . ఎందరో పెద్దల అండదండలు ఉన్నప్పటికి భాషానిలయం పెద్ద ఎత్తున నిధుల సేకరణ జరపలేదు. కనీస అవసరాలకు తగిన విరాళాలను మాత్రమే సేకరించింది. స్థాపన నాటినుంచి నేటివరకు ఇదే సంప్రదాయం కొనసాగుతుంది.

రాచరిక పాలాన నుంచి విముక్తి పొందిన అనంతరం హైదరాబాదు రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారి ఇ.పి.టి. నిధి నుంచి 6000 రూపాయలు ఆర్ధిక సహాయం అందించినది. ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు హైదరాబాదు పురపాలక సంఘం మొదటి మేయర్ గా ఎన్నోకోబడిన తరువాత హైదరాబాదు పురపాలక సంఘం భాషానిలయనికి 60. రుపాయాలు విరాళంగా మంజూరు చేసినది.

2002 సంవత్సరం లో భాషానిలయం శతాబ్ది ఉత్సవాలు నిర్వహించగా ఆ ఉత్సవానికి విచ్చేసిన అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు నూతన భవన నిర్మాణం కొరకు 30 లక్షల గ్రాంటును ఇవ్వడం జరిగినది.

## భాషానిలయం పేరు మార్పు

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత, తెలంగాణ ప్రజల మనోభావాలకు అనుగుణంగా 2017 లో చిన్న మార్పు చేసి రిజిస్ట్రేషన్ ద్వారా చట్ట బద్దత కల్పించబడినది. 1901 సెప్టెంబర్ 1 వ తేదీన "శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం" అనే పేరున గ్రంథాలయం స్థాపించారు.

ఇప్పుడు "ఆంధ్ర " అనే పదాన్ని తొలగించి దాని స్థానంలో " తెలుగు " అనే పదాన్ని చేర్చి శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషనిలయం " అని నామకరణం చేయడం జరిగింది.



-బి. లింగరాజు
సెల్:9640346316

## బంధం

బంధం ముడిపడాల్సింది అనుబంధం,
ఆప్యాయతలతో కానీ మనస్పర్థలతో కాదు
బంధం ముగియాల్సింది మరణంతో కానీ
విడిపోయి ఉండటం వల్ల కానే కాదు
విలువలు లేని చోట బంధం నిలపడదు
డబ్బు ప్రాధాన్యమైన చోట బంధం
గిరిగీసుకుని ఉండిపోదు
బంధం ఏదైనా బాధ పంచుకునేలా ఉండాలి
కానీ, బాధ పెంచేలా ఉండకూడదు.
విభేధాలు ఎన్ని ఉన్నా విడిపోకుండా ఉండాలి
అలకలు, కొట్లాటలు కట్టిపెట్టి
కలిసి మెలిసి ఉండాలి
బంధం బలపడాలంటే కావాల్సింది
ఈర్ష్య ద్వేషాలు కాదు..
పగలు, ప్రతీకారాలు అంతకన్నా కాదు
బంధం నిలబడాలంటే కావాల్సింది
ప్రేమలు, నమ్మకాలు..
ఆప్యాయతతో కూడిన అనురాగాల
బంధం ముడిపడాలి అనుబంధంతో
ప్రేమ, ఆప్యాయత అనే మకరందంతో!

-ఎన్.రాజేష్
9849335757



## మూలాత్మ !

అబద్దానికి , అన్యాయానికి
మనమెంత మంచి రంగులద్దినా
నాణ్యతలో అన్నీ వెలిసిపోయేవే !
అనుకూలంగా మలచుకోవడంలో
ఏకపక్షంగా ఎన్ని కట్టుకథలల్లినా
కాలంతో అన్నీ కనుమరుగయ్యేవే !
నచ్చనివాళ్ళెన్ని మరకలంటించినా
నిజంముందు ఏదీ నిలబడలేక
ఎడారిలో నీటిలా అన్నీఆవిరయ్యేవే !
గొప్పగొప్ప తత్వవేత్తలంతా లోకంలో
తిప్పితిప్పి ఎంతచెప్పినా, ఏదిచెప్పినా
ఉన్నదున్నట్లు చూపడంలో అద్దానికి
ధీటైనది , సత్యానికి సమానమైనది
భూమిపై పురుడుపోసుకొనట్లే , ఇంకా
నిజాన్నిమించిన ఫిలాసఫీ పుట్టలేదు
ఇదే సువిశాల భారతీయ మూలాత్మ !



- డా. డి. రాజేశ్
9440460490

## మనిషి మనస్తత్వం

సమాజంలో అగ్గిరాజేస్తుంటే
నా ఆలోచనల అలజడిలో
అక్షరం కావాతు మొదలైన
కించిత్ చలనం లేని మనిషిలో
అచ్చుయినా అక్షరం
తెర్చిన పుస్తకం తో
అరచేతిలో తిరుగుతూనే ఉంది
ఆలోచన్ల పర్వంలో
లోలోపల గుండె గొట్టం లో
రక్తం వేడిగా ఊరకలు వేస్తుంది
నేను నేనుగానే
అక్షరాల వెంబడి వెళ్తున్న
సామాజిక సమస్యలపై
పెన్ను గన్నులా దూసుకొస్తున్న
మనిషి మనస్తత్వం
కదలనని మోరాయిస్తున్నది
నాలుగోడల మధ్య
అక్షరాలు కలంతో యుద్ధం చేస్తూ
లోకం మోసపోతుంది అంటూ
శ్వాసనిట్టూర్పులో సేదతీరుతుంది.

-ఎలగొండ రవి
9848770345



## గుడ్ టచ్ ఆర్ బాడ్ టచ్

కొన్నిచోట్ల
కొన్నిసార్లు అంతుచిక్కని
ప్రశ్నల మధ్య నేను ,
నాలాంటి నువ్వు మిగిలిపోతాం.
వేటకెళ్ళిన ఓ జాలరీ
వలకు తల్లీ చేప చిక్కితే
ఒకరి కడుపు నిండాలంటే
ఇంకో కడుపు కొట్టాలని
లోకమంతా సాగుతున్న పాఠం.
పిల్లలు కానీ గొడ్రాలు
వయసయ్యాక
వృద్ధాశ్రమాన్ని చూసి
జాలిపడుతుంటే
కన్నప్రేగు కన్నీరు పెడుతున్నది.
విస్తృతంగా విస్తరించిన అడవిని
విరిగిన ఒక కొమ్మనే
ఒకనొకరోజు ఇనుమును తొడుక్కొని
అడవిని ధ్వంసం చేస్తున్నది.
అమ్మలందరు ఎందుకో కొడుకులనే
కనాలనుకుంటారు.
అమ్మ కూడా అడబిడ్డనని మరిచిపోతున్నది.
మందను ముందేసుకొని
నినదించే చేతులే
బానిసత్వపు దోసిలిలో
బరితెగించి అరితేరుతున్నాయి.
ఈ సమాజాన్ని సున్నితంగా తాకుతూ
ఉద్దేశ్యం చెప్పకుండానే
వాడు పూటకోసారి
పోటు పొడుస్తాడు .
ఎప్పటికీ అంతుచిక్కని
మంచి చెడుల వ్యత్యాసం.

- రామ్ పెరుమాండ్ల
9542265831

